RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 311 పేజీలు - 08 సోమవారం 05 అక్టోబర్ 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

## ఆసియా క్రీడలకు ఘన ముగింపు

- 85 పతకాలతో నాలుగో స్థానంలో భారత్




2లో

## ఉక్రెయిన్‌లో భారత ఫార్మా సంస్థపై రష్యా డ్రోన్ దాడి

- ఒకరి మృతి.. భారీగా దెబ్బతిన్న కుసుమ్ గ్రూప్ ఔషధ తయారీ కేంద్రం



2లో



## సూపర్ ఇంటెలిజెన్స్ ఫోర్స్ ఏర్పాటు

**అమెరికా ఆధిపత్యమే లక్ష్యం.. ట్రంప్ కీలక నిర్ణయం**

తొలి అక్షరం/వాషింగ్టన్, అక్టోబర్ 04:కృత్రిమ మేధస్సు రంగంలో అమెరికా ఆధిపత్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. 'సూపర్ ఇంటెలిజెన్స్ ఫోర్స్' పేరుతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

మిగతా2లో...

# ప్రకృతి సాగులో ఏపీ దేశానికే ఆదర్శం

**చంద్రబాబు ప్రోత్సాహం అభినందనీయం: కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్**




తొలి అక్షరం/తెనాలి, అక్టోబర్ 04:ప్రకృతి వ్యవసాయంలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రశంసించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకృతి సాగును ప్రోత్సహిస్తున్న తీరు అభినందనీయమని అన్నారు.గుంటూరు జిల్లా బుర్రిపాలెంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి రైతు జానకీరామ్‌కు చెందిన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని కేంద్ర మంత్రి సందర్శించారు. ఎలాంటి రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించకుండా సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. ప్రకృతి సాగు విధానం, పెట్టుబడి ఖర్చుల వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి సాగు చేపట్టే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని

మిగతా2లో...



## బడ్జెట్ అంచనాలకు దూరంగా తెలంగాణ రాబడులు

- మూడేళ్లుగా అంచనాల కంటే తక్కువగా వాస్తవ వసూళ్లు

తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 04:తెలంగాణ ప్రభుత్వ ఆదాయ వసూళ్లు బడ్జెట్‌లో వేసుకున్న అంచనాలకు గణనీయంగా దూరంగా ఉంటున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 202223 నుంచి 202425 వరకు వరుసగా మూడు ఆర్థిక సంవత్సరాల్లోనూ అంచనాల కంటే వాస్తవ రాబడులు

మిగతా2లో...

## ప్రజా సమస్యలపై బీజేపీ ప్రజాప్రతినిధులు విఫలం

- బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు అసమర్థులు
- బీజేపీ నేతలకు ప్రజా సమస్యలు పట్టవు
- రాష్ట్ర ప్రయోజనాలను గాలికొదిలిన బీజేపీ ప్రజాప్రతినిధులు
- బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలపై పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ఫైర్
- ప్రజల కోసం పనిచేయలేని బీజేపీ నేతలు
- బీజేపీ ప్రజాప్రతినిధుల తీరుపై మహేశ్‌కుమార్ గౌడ్ ధ్వజం



తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 04: బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రజా సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమయ్యా రని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించి నిధులు, అభివృద్ధి ప్రాజెక్టులు సాధించాల్సిన బాధ్యత బీజేపీ ప్రజాప్రతినిధులపై ఉందని, అయితే వారు ఆ బాధ్యతను విస్మరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడంలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు విఫలమయ్యారని ఆయన అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు, రాష్ట్రానికి రావాల్సిన నిధులు, అభివృద్ధి పనులపై

మిగతా2లో...

## తెలంగాణలో శ్వేత విప్లవానికి అమూల్ ఊతం

- రూ.400 కోట్లతో సాబర్ డెయిరీ ప్లాంట్.. 18 నెలల్లో పూర్తి చేస్తాం: కిషన్‌రెడ్డి




తొలి అక్షరం/మెదక్, అక్టోబర్ 04:పాల ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలోనే ముందంజలో ఉందని, తెలంగాణ కూడా శ్వేత విప్లవంలో కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం బ్రాహ్మణపల్లిలో అమూల్ సంస్థకు చెందిన సాబర్ డెయిరీ అత్యాధునిక పాల పరిశ్రమకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా పాడి రైతులతో ముఖాముఖి నిర్వహించి పాడి రంగ అభివృద్ధి, సహకార వ్యవస్థ బలోపేతంపై మాట్లాడారు.**రూ.400 కోట్లతో భారీ పరిశ్రమ**

మిగతా2లో...

## ఏపీలో గృహ నిర్మాణ రంగంలో నూతన శకం

- 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం..

**3డీ కాంక్రీట్ ప్రింటింగ్‌తో కొత్త విధానం: పవన్ కల్యాణ్**



తొలి అక్షరం/గుంటూరు,అక్టోబర్ 04: ఆంధ్రప్రదేశ్‌లో గృహ నిర్మాణ రంగంలో నూతన, వినూత్న శకం ప్రారంభమైందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. పేదలందరికీ సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంలో భాగంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజనగ్రామీణ్ 2.0 కింద రాష్ట్రంలో 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం కీలక ముందడుగని పేర్కొన్నారు. గుంటూరు జిల్లా బుర్రిపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఈ గృహ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో గృహ నిర్మాణాన్ని మరింత వేగవంతం చేయడంతో పాటు నాణ్యతను పెంచేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని పవన్ కల్యాణ్ తెలిపారు. దేశంలోనే తొలిసారిగా గ్రామీణ గృహ నిర్మాణంలో 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ సాంకేతికతను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. బుర్రిపాలెం, ఓబులనాయుడు పాలెం గ్రామాల్లో ఈ సాంకేతికతతో 177 ఇళ్లను నిర్మించనున్నట్లు తెలిపారు.**పది రోజుల్లో ఇల్లు నిర్మాణం** 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ విధానంతో ఒక్కో ఇంటి నిర్మాణాన్ని సుమారు పది రోజుల్లోనే పూర్తి చేసే అవకాశం ఉంటుందని

మిగతా2లో...



## ఎస్ఎల్‌బీసీ పనుల్లో వేగం.. 2028 జూన్ నాటికి నీటి లక్ష్యం

- షియర్ జోన్‌ను దాటి ముందుకు సాగుతున్న టన్నెల్ పనులు: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 04: శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. టన్నెల్ నిర్మాణంలో అత్యంత క్లిష్టమైన ప్రాంతాలను అధిగమిస్తూ పనులు ముందుకు సాగుతున్నాయని చెప్పారు. 2028 జూన్ నాటికి ఎస్‌ఎల్‌బీసీ ద్వారా నీటిని అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వెల్లడించారు.టన్నెల్ నిర్మాణంలో ప్రమాదకరమైన షియర్ జోన్‌ను విజయవంతంగా దాటి తవ్వకాలు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. గత ఆరు నెలల కాలంలో సుమారు 700 మీటర్ల మేర టన్నెల్ పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. భౌగోళిక పరిస్థితులు, గతంలో

మిగతా2లో...

## కులగణన కోసం ప్రజా ఉద్యమం

- బీసీలకు జనాభా ప్రాతిపదికన హక్కులుద కల్పించాలి: మంత్రి పొన్నం ప్రభాకర్



తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 04: దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి బీసీలకు జనాభా ప్రాతిపదికన హక్కులు, అవకాశాలు కల్పించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. కులగణన కోసం ప్రజా ఉద్యమాన్ని మరింత

మిగతా2లో...

# తెలంగాణలో శ్వేత విప్లవానికి అమూల్ ఊతం

(మొదటి పేజీ తరువాయి)

తూప్రాన్‌లో సుమారు రూ.400 కోట్ల పెట్టుబడితో సాబర్ డెయిరీ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించనున్న ఈ పరిశ్రమను 18 నెలల్లో అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. స్థానికంగా పాడి రైతుల నుంచి పాలను సేకరించి వాటికి విలువ జోడించడం ద్వారా రైతులకు మెరుగైన ఆదాయం లభించేలా ఈ పరిశ్రమ దోహదపడుతుందని వివరించారు.ప్లాంట్ ద్వారా పాలు, పెరుగు, మజ్జిగ, లస్సీ, పనీర్, ఐస్‌క్రీమ్, నెయ్యి తదితర పాల ఉత్పత్తులను తయారు చేయనున్నారు. పాలకు స్థానికంగానే విలువ జోడించి మార్కెటింగ్ చేయడం వల్ల పాడి రైతులకు మరింత మెరుగైన మార్కెట్ అవకాశాలు లభిస్తాయని అధికారులు తెలిపారు.**రైతులు సహకార సంఘాలుగా ఏర్పడాలి** గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి సహకార వ్యవస్థ ఎంతో కీలకమని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రామాల్లో రాజకీయ జోక్యంతో బలహీనపడిన సహకార సంఘాలను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులంతా కలిసికట్టుగా పాల సహకార సంఘాలను ఏర్పాటు చేసుకుని తమ ఉత్పత్తులకు మెరుగైన ధరలు పొందాలని సూచించారు. మధ్యవర్తులపై ఆధారపడకుండా రైతులే సంఘాల ద్వారా పాలు సేకరించి, ప్రాసెసింగ్, మార్కెటింగ్ చేపట్టే విధంగా వ్యవస్థను బలోపేతం చేయాలని అన్నారు.

**తెలంగాణలో 1,525 కొత్త పాల సహకార సంఘాలు** దేశవ్యాప్తంగా శ్వేత విప్లవాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కేంద్ర మంత్రి తెలిపారు. 2029 నాటికి దేశంలో 75 వేల కొత్త పాల సహకార సంఘాలను ఏర్పాటు చేయాలన్న లక్ష్యంలో భాగంగా తెలంగాణలో 1,525 కొత్త సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. వీటి ద్వారా పాడి రైతులకు మార్కెట్ అవకాశాలు పెరగడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని అన్నారు.**మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు** సాబర్ డెయిరీ ప్లాంట్ ఏర్పాటుతో స్థానిక యువతతో పాటు మహిళలకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని కిషన్‌రెడ్డి తెలిపారు. పాడి పరిశ్రమ ద్వారా రైతులకు వ్యవసాయంతో పాటు అదనపు ఆదాయ మార్గం ఏర్పడుతుందని చెప్పారు. మహిళా సంఘాలు బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని పశువులను కొనుగోలు చేసి పాల ఉత్పత్తిని పెంచుకోవచ్చని సూచించారు. దీనివల్ల మహిళల ఆర్థిక స్వావలంబనకు కూడా తోడ్పాటు అందుతుందని పేర్కొన్నారు.

**పరిశ్రమలకు పూర్తి సహకారం** తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. పాడి రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో డెయిరీ పరిశ్రమలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. అమూల్ సంస్థకు తెలంగాణలో మంచి అవకాశాలు ఉన్నాయని, పాడి రైతులకు ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు.సాబర్ డెయిరీ ప్లాంట్ ఏర్పాటుతో మెదక్ జిల్లాలో పాడి రంగానికి కొత్త ఊపు వస్తుందని, రైతుల ఆదాయం పెరగడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని ప్రజాప్రతినిధులు, అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో శ్వేత విప్లవాన్ని మరింత బలోపేతం చేయడంలో ఈ పరిశ్రమ కీలక మైలురాయిగా నిలుస్తుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# ఏపీలో గృహ నిర్మాణ రంగంలో నూతన శకం

(మొదటి పేజీ తరువాయి)

పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ సాంకేతికత ద్వారా నిర్మాణ సమయం తగ్గడంతో పాటు నిర్మాణ వ్యర్థాలు కూడా తగ్గుతాయని చెప్పారు. నాణ్యత, నిర్మాణ సామర్థ్యం మరింత మెరుగుపడుతాయని వివరించారు. ప్రయోగాత్మక ప్రాజెక్టు విజయవంతమైతే ఆధునిక సాంకేతికతను మరింత విస్తృతంగా వినియోగించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. **పేద కుటుంబాలకు గౌరవప్రదమైన నివాసం**ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన శాశ్వత నివాసం కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. గృహ నిర్మాణ కార్యక్రమాలను వేగవంతం చేస్తూ సాంకేతికతను విస్తృతంగా ఉపయోగించుకోవడం ద్వారా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి బలమైన పునాది వేస్తున్నామని చెప్పారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో పేదల కోసం చేపడుతున్న గృహ నిర్మాణ కార్యక్రమాలకు పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో గ్రామీణ గృహ నిర్మాణంలో మరిన్ని వినూత్న విధానాలను అమలు చేయగలుగుతున్నామని పేర్కొన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

**నిర్మాణంలో సాంకేతికతకు ప్రాధాన్యం**కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో గృహ నిర్మాణ కార్యక్రమాలను వేగంగా ముందుకు తీసుకెళ్తోందని పవన్ కల్యాణ్ తెలిపారు. సాంకేతికతతో విస్తృతిని, నాణ్యతతో వేగాన్ని, వినూత్న విధానాలతో సంక్షేమాన్ని మేళవిస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదల ఇళ్ల నిర్మాణంతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ ద్వారా నిర్మించే ఇళ్లకు తక్కువ సమయంలో నిర్మాణం పూర్తవడంతో పాటు శ్రమ, నిర్మాణ వ్యయం, వ్యర్థాలు తగ్గే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

గుంటూరు జిల్లాలో చేపడుతున్న ప్రయోగాత్మక ప్రాజెక్టును ఆరు నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు.

**గ్రామీణ ఏపీ అభివృద్ధికి కొత్త పునాది** పేదల సొంతింటి కలను సాకారం చేయడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని గ్రామీణ ప్రాంతాలకు తీసుకురావడం ద్వారా ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ రంగంలో కొత్త దిశగా అడుగులు వేస్తోందని పవన్ కల్యాణ్ అన్నారు. ప్రతి కుటుంబానికి ఒక నీడ, ప్రతి ఇంటి నిర్మాణంలో ఆధునిక సాంకేతికత, గ్రామీణ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి బలమైన పునాది అనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.

# ఎస్ఎల్‌బీసీ పనుల్లో వేగం.. 2028 జూన్ నాటికి నీటి లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఎదురైన సాంకేతిక సమస్యలు, పనుల్లో ఏర్పడిన అంతరాయాలను అధిగమిస్తూ నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని వివరించారు.మొత్తం 43.968 కిలోమీటర్ల ప్రధాన టన్నెల్‌లో ఇప్పటికే సుమారు 79 శాతం పనులు పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. ఇంకా 9.1 కిలోమీటర్ల మేర పనులు మిగిలి ఉన్నాయని చెప్పారు. మిగిలిన పనులను కూడా వేగంగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అధికారులు, ఇంజినీర్లకు తగిన సూచనలు చేస్తున్నట్లు తెలిపారు.

ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పూర్తయితే నల్లగొండతో పాటు పరిసర ప్రాంతాల్లో సాగు, తాగునీటి అవసరాలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని మంత్రి పేర్కొన్నారు. ప్రాజెక్టు ద్వారా 30 టీఎంసీలకు పైగా నీటిని అందించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

కరువు ప్రభావిత ప్రాంతాలకు సాగునీరు అందించడంతో పాటు భూగర్భ జలాల పెంపునకు కూడా ప్రాజెక్టు దోహదపడుతుందని చెప్పారు.టన్నెల్ పనుల్లో భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సాంకేతిక నిపుణుల సూచనల మేరకు ఆధునిక పద్ధతులను వినియోగిస్తూ పనులు చేపడుతున్నట్లు వివరించారు. నిర్మాణ సమయంలో కార్మికులు, ఇంజినీర్ల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు.ఎస్ఎల్‌బీసీ పనులు పూర్తయిన తర్వాత ఈ ప్రాంత రైతులకు సాగునీటి లభ్యత మరింత మెరుగుపడుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రాజెక్టును నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు, రైతులకు ప్రయోజనం చేకూర్చేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

# వెయ్యి రోజులు దాటినా ఆరు గ్యారెంటీలు అమలు కాలేదు

- కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు..

**మైనారిటీల సంక్షేమంపై నిలదీత**



**తొలి అక్షరం/సిద్దిపేట జిల్లా,అక్టోబర్ 04:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు దాటినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు. ఆరు గ్యారెంటీల అమలుపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు దాటినా వాటిని ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు.గజ్వేల్‌లో నిర్వహించిన తెలంగాణ తురక కాశ సంక్షేమ కార్యక్రమంలో పాల్గొన్న హరీశ్‌రావు 90 మంది కాశ కార్మికులకు రాతి కోత యంత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనారిటీలకు ప్రతి సంవత్సరం రూ.4 వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి రూ. 1,800 కోట్ల వరకు ఖర్చు చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం కేటాయింపులు, ఖర్చులను తగ్గించిందని ఆరోపించారు.**మైనారిటీ సంక్షేమంపై ప్రశ్నలు** మైనారిటీ గురుకులాల నిర్వహణ సక్రమంగా లేదని హరీశ్‌రావు ఆరోపించారు. విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని, విదేశీ విద్య కోసం మైనారిటీ విద్యార్థులకు అందాల్సిన ఉపకార వేతనాలు సకాలంలో అందడం లేదని అన్నారు. మైనారిటీ కార్పొరేషన్ ఉద్యోగులకు నెలలుగా, ఉర్దూ అకాడమీ ఉద్యోగులకు ఏడాదిగా జీతాలు అందడం లేదని ఆయన పేర్కొన్నారు. మైనారిటీ సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

# కరవుతో తెలంగాణ అల్లాడుతోంది.. ప్రభుత్వం వెంటనే స్పందించాలి

- కరువు మండలాలను ప్రకటించి రైతులను ఆదుకోవాలి: కవిత



**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 04:** తెలంగాణలో కరవు పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షు రాలు కవిత ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.తక్షణమే కరువు మండలాలను ప్రకటించి రైతులకు అవసరమైన సహాయం అందించాలని కవిత డిమాండ్ చేశారు. ప్రత్యేక మంత్రివర్గ సమావేశం నిర్వహించి కరవు పరిస్థితులపై సమగ్రంగా చర్చించాలని కోరారు. భూగర్భ జలాలు పడిపోవడంతో సాగు, తాగునీటి సమస్యలు తీవ్రతరం అవుతున్నాయని పేర్కొన్నారు.కృష్ణా జలాల వినియోగం, సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె సూచించారు. నార్లాపూర్ రిజర్వాయర్ పనులను పూర్తి చేసి ఉంటే ఈ పరిస్థితుల్లో రైతులకు, భూగర్భ జలాల పెంపునకు ప్రయోజనం కలిగేదని కవిత పేర్కొన్నారు.

# ఆసియా క్రీడలకు ఘన ముగింపు

**తొలి అక్షరం/నాగోయా, అక్టోబర్ 04:**జపాన్‌లోని ఐచినాగోయాలో సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరిగిన 20వ ఆసియా క్రీడలు ఆదివారం ఘనంగా ముగిశాయి. నాగోయా సిటీ మిజుహో పార్క్ అథ్లెటిక్ స్టేడియంలో నిర్వహించిన ముగింపు వేడుకల్లో క్రీడాకారుల పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఈ క్రీడల్లో భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శన కనబరిచి మొత్తం 85 పతకాలు సాధించారు. ఇందులో 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్య పతకాలు ఉన్నాయి. దీంతో పతకాల పట్టికలో భారత్ నాలుగో స్థానంలో నిలిచింది. షూటింగ్, అథ్లెటిక్స్, బాక్సింగ్, హాకీ, ఆర్చరీ, రెజ్లింగ్ తదితర క్రీడాంశాల్లో భారత క్రీడాకారులు సత్తా చాటారు.ముగింపు వేడుకల్లో తదుపరి ఆసియా క్రీడల ఆతిథ్య బాధ్యతలను ఖతార్‌కు అప్పగించారు. 2030లో 21వ ఆసియా క్రీడలు దోహాలో జరగనున్నాయి. క్రీడాస్ఫూర్తి, అద్భుత ప్రదర్శనలతో సాగిన ఐచినాగోయా ఆసియా క్రీడలు ఘనంగా ముగిశాయి.

# ఉక్రెయిన్‌లో భారత ఫార్మా సంస్థపై రష్యా డ్రోన్ దాడి

**తొలి అక్షరం/సుమీ, అక్టోబర్ 04:**ఉక్రెయిన్‌లోని సుమీ ప్రాంతంలో భారత మూలాలున్న కుసుమ్ గ్రూప్‌కు చెందిన ఔషధ తయారీ కేంద్రంపై రష్యా డ్రోన్లు దాడి చేశాయి. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, పలువురు గాయపడినట్లు సమాచారం. డ్రోన్ దాడిలో ఫార్మా సంస్థ ప్రధాన భవనం భారీగా దెబ్బతిన్నట్లు అంతర్జాతీయ వార్తా సంస్థలు వెల్లడించాయి.ఈ దాడిని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్స్కీ తీవ్రంగా ఖండించారు. సైనిక స్థావరం కాని ఔషధ సంస్థను లక్ష్యంగా చేసుకోవడం దారుణమని పేర్కొన్నారు. ఔషధాలు, వైద్య సామగ్రి నిల్వ చేసే కేంద్రంపై దాడి జరగడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు.కుసుమ్ గ్రూప్ 1994లో భారతదేశం నుంచి ఉక్రెయిన్‌కు ఔషధాల ఎగుమతులతో కార్యకలాపాలు ప్రారంభించింది. 2009లో సుమీలో ఔషధ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. తాజా దాడితో సంస్థకు భారీ ఆస్తి నష్టం వాటిల్లినట్లు సమాచారం. నష్టం విలువ కనీసం రూ.400 కోట్ల వరకు ఉండొచ్చని అంచనాలు వెలువడ్డాయి.

# సూపర్ ఇంటెలిజెన్స్ ఫోర్స్ ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న అత్యాధునిక కృత్రిమ మేధస్సు సాంకేతికతలో అమెరికా ముందంజలో ఉండేలా ఈ బృందం పనిచేయనుంది.ఈ ప్రత్యేక బృందానికి నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ జే క్లేటన్ నేతృత్వం వహించనున్నారు. ఫెడరల్ ట్రేడ్ కమిషన్ చైర్మన్ ఆండ్రూ ఫెర్గూసన్, రక్షణ శాఖకు చెందిన ఉన్నతాధికారులు సహా పలువురు ఇందులో కీలక బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ బృందం నేరుగా అధ్యక్షుడు ట్రంప్, వైట్‌హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌కు నివేదించనుంది.ప్రపంచ సూపర్ ఇంటెలిజెన్స్ రంగంలో అమెరికా నాయకత్వాన్ని కొనసాగించడం, సాంకేతికతను ప్రజల ప్రయోజనాలకు ఉపయోగించడం ఈ బృందం ప్రధాన లక్ష్యమని ట్రంప్ తెలిపారు. కృత్రిమ మేధస్సు అభివృద్ధిలో చైనాతో పోటీ నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. జాతీయ భద్రత, ఆర్థికాభివృద్ధి, సాంకేతిక పురోగతికి అనుగుణంగా వ్యూహాలను రూపొందించడంపై బృందం దృష్టి పెట్టనుంది.

# ప్రకృతి సాగులో ఏపీ దేశానికే ఆదర్శం

(మొదటి పేజీ తరువాయి)

చౌహాన్ తెలిపారు. బీజామృతం, జీవామృతం వంటి సహజ పద్ధతులతో సాగు చేయడం వల్ల భూసారం పెరగడంతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందుతుందని పేర్కొన్నారు. ప్రకృతి సాగును ప్రోత్సహించడం ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యాల్లో భాగమని తెలిపారు.ప్రకృతి పద్ధతిలో ఎకరా వరి సాగుకు సుమారు రూ.7 వేలు మాత్రమే ఖర్చవుతోందని రైతు జానకీరామ్ తెలిపారు. రసాయన ఎరువులతో సాగు చేస్తే దాదాపు రూ.25 వేల వరకు ఖర్చవుతుందని వివరించారు. ప్రకృతి సాగుతో పెట్టుబడి ఖర్చులు తగ్గడంతో పాటు పంటలకు మార్కెట్‌లో మంచి ధర లభిస్తోందని చెప్పారు.

# బడ్జెట్ అంచనాలకు దూరంగా తెలంగాణ రాబడులు

(మొదటి పేజీ తరువాయి)

తక్కువగా నమోదయ్యాయి.202223లో ప్రభుత్వం రూ.1.93 లక్షల కోట్ల రాబడిని అంచనా వేయగా.. వాస్తవంగా రూ.1.59 లక్షల కోట్లు మాత్రమే సమకూరాయి. 202324లో రూ.2.16 లక్షల కోట్ల అంచనాకు గాను రూ.1.69 లక్షల కోట్లు, 202425లో రూ.2.21 లక్షల కోట్ల అంచనాకు గాను రూ.1.67 లక్షల కోట్ల రాబడి మాత్రమే నమోదైంది.ప్రధానంగా కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు, సహాయ నిధులు, అలాగే పన్నేతర ఆదాయాల్లో అంచనాలువాస్తవ వసూళ్ల మధ్య భారీ వ్యత్యాసం కనిపించింది. 202425లో గ్రాంట్ల రూపంలో రూ.21,636 కోట్ల రాబడిని అంచనా వేయగా.. రూ.7,913 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. పన్నేతర ఆదాయంలోనూ అంచనా లకు అనుగుణంగా వసూళ్లు జరగలేదు.వరుసగా అంచనాలు, వాస్తవ రాబడుల మధ్య వ్యత్యాసం కొనసాగడం రాష్ట్ర ఆర్థిక నిర్వహణపై ప్రభావం చూపే అంశంగా మారింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కూడా తెలంగాణ ప్రభుత్వం రూ.2.41 లక్షల కోట్ల రెవెన్యూ రాబడిని అంచనా వేసింది.

# ప్రజా సమస్యలపై బీజేపీ ప్రజాప్రతినిధులు విఫలం

(మొదటి పేజీ తరువాయి)

బీజేపీ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై మాట్లాడకుండా రాజకీయ విమర్శలకే పరిమితం కావడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతోందని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. బీజేపీ నేతల తీరును ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో ప్రజలే తగిన సమాధానం చెబుతారని అన్నారు.

# కులగణన కోసం ప్రజా ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన బీసీల బహిరంగ సభలో మంత్రి పాల్గొని మాట్లాడారు.తెలంగాణలో ఇప్పటికే సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే నిర్వహించి వివరాలను సేకరించామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. దేశవ్యాప్తంగా కూడా బీసీల జనాభాను శాస్త్రీయంగా లెక్కిస్తేనే వారికి విద్య, ఉద్యోగాలు, రిజర్వేషన్లు, రాజకీయ ప్రాతినిధ్యంలో సముచిత అవకాశాలు కల్పించేందుకు వీలుంటుందని పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జనగణనలో బీసీ, ఓబీసీలకు ప్రత్యేకంగా కాలమ్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే కోరిందని మంత్రి తెలిపారు. గతంలో సరైన కుల వివరాల నమోదు లేకపోవడంతో సేకరించిన సమాచారం ఉపయోగపడని పరిస్థితి ఏర్పడిందని, భవిష్యత్‌లో అలాంటి సమస్యలు రాకుండా శాస్త్రీయ పద్ధతిలో కులాల వారీగా జనాభాను నమోదు చేయాల్సిన అవసరం ఉందన్నారు.బీసీల హక్కుల కోసం ప్రజలు, బీసీ సంఘాలు, ప్రజాప్రతినిధులు కలిసి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. జనాభా లెక్కలు స్పష్టంగా ఉంటేనే సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, సంక్షేమ విధానాలను సమర్థంగా అమలు చేయగలమని ఆయన పేర్కొన్నారు.

# భారతీయ జనతా యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా నవీన్ యాదవ్



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) అక్టోబర్ 4:** భారతీయ జనతా యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా నూకల నవీన్ యాదవ్ నియమితులయ్యారు. 2019లో బీజేవైఎం కార్యకర్తగా 2020-2023 బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శిగా 2023-2026 బీజేవైఎం జిల్లా అవుట్రీచ్ కన్వీనర్ బాధ్యతలు నిర్వర్తించి బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియామకమయ్యారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఈ బాధ్యత ఇచ్చినందుకు బిజెపి జిల్లా అధ్యక్షులు సౌద రమేష్,భారతీయ జనతా యువ మోర్చా జిల్లా అధ్యక్షులు హరీష్ యాదవ్, పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జ్ లేగా రామ్మోహన్ రెడ్డి,బిజెపి తొర్రూరు అర్బన్ మండల అధ్యక్షుడు ఫైండ్ల రాజేష్,భారతీయ జనతా పార్టీ కార్యకర్తలందరికీ ధన్యవాదాలు తెలిపారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గృహిణికి కుట్టు మిషన్ అందజేత




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) అక్టోబర్ 4:** లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ లయన్ నరహరి సుధాకర్ రెడ్డి ఆదేశాల మేరకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు నాళ్ళ కృష్ణమూర్తి అధ్యక్షతన ఆదివారం తొర్రూర్ పట్టణ కేంద్రంలోని నిరుపేద గృహిణి మాదవికి లయన్ తాటికొండ శ్రీనివాస్ ఒక కుటుంబం జీవనోపాది కోసం ఆయన మనుమడు పుట్టిన రోజు సందర్భంగా కుట్టు మిషన్ బహుకరించారు. కుట్టు మిషన్ అందించిన శ్రీనివాస్ ను లయన్స్ క్లబ్ ప్రతినిధులు అభినందించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇలాంటి సేవాకార్యక్రమాలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ డాక్టర్ సూర్ణం రాంనర్సయ్య,రిజియన్ అడ్వైజర్ ప్రతాపని వెంకటేశ్వర్లు,లయన్ అనుమాండ్ల మోహన్ రెడ్డి, లయన్ గంజి విజయపాల్ రెడ్డి, లయన్ ముడుపు రవీందర్ రెడ్డి, క్లబ్ సెక్రటరీ పోతుల వెంకటేశ్వర్ రెడ్డి, ట్రెజరర్ ముదిరెడ్డి రమణా రెడ్డి, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# తొర్రూర్ పోలీసుల అకస్మిక తనిఖీలు

- ముగ్గురికి గంజాయి పాజిటివ్
- అంబేద్కర్ కాలనీలో తొర్రూర్ సీఐ గణేష్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్
- 9 వాహనాలపై కేసులు నమోదు.. మత్తు పదార్థాలపై ప్రజలకు అవగాహన



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) అక్టోబర్ 4:** తొర్రూర్ పట్టణ పరిధిలోని అంబేద్కర్ కాలనీలో ఆదివారం తొర్రూర్ సీఐ గణేష్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా 'కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్' నిర్వహించారు. కాలనీలోని ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా తనిఖీ చేసిన పోలీసులు,అనుమానితుల వివరాలను సేకరించారు.ఈ తనిఖీల సమయంలో సరైన నంబర్ ప్లేట్లు, సరైన పత్రాలు లేని 9 ద్విచక్ర వాహనాలను గుర్తించి, వాటిపై తదుపరి చర్యల నిమిత్తం కేసులు నమోదు చేశారు. అలాగే అనుమానితంగా కనిపించిన పలువురికి ఆధునిక డ్రగ్ టెస్టింగ్ కిట్ల ద్వారా అక్కడికక్కడే పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ముగ్గురు వ్యక్తులు గంజాయి సేవించినట్లు పాజిటివ్‌గా తేలడంతో, వారిపై చట్టరీత్యా కేసులు నమోదు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.**మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: సీఐ గణేష్**ఈ సందర్భంగా సీఐ గణేష్ మాట్లాడుతూ.గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలను కాలనీవాసులకు వివరించారు. మత్తు పదార్థాల సరఫరా లేదా వినియోగంపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల అదుపునకు పట్టణ ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తొర్రూర్ ఎస్సై మహేందర్ రెడ్డి, పలువురు ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అతివేగం బలితీసుకున్న యువకుడి ప్రాణం

- నాచారంలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),అక్టోబర్4:** అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ ఒక వర్ధమాన విద్యార్థి ప్రాణాన్ని బలితీసుకోగా, మరొకరిని తీవ్ర గాయాలపాలు చేసింది.నాచారం లక్ష్మీ టార్చ్ కంపెనీ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. బాధితుల వివరాల ప్రకారం...ఉప్పల్, బీరప్ప గడ్డకు చెందిన కొమరి అభిలాష్ (17, విద్యార్థి) తన స్నేహితుడు, జొమాటో డెలివరీ బాయ్ నెరెళ్ల సందీప్ (18)తో కలిసి ఆదివారం తెల్లవారుజామున సుమారు 3.30 గంటల సమయంలో డెలివరీ పనిమీద ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనం పై చిల్కానగర్ నుండి నాచారం ఎక్స్ రోడ్ వైపు వెళ్తున్నారు.వాహనాన్ని అభిలాష్ నడుపుతుండగా, సందీప్ వెనుక కూర్చున్నాడు. వీరి వాహనం నాచారం లక్ష్మీ టార్చ్ కంపెనీ పక్కన ఉన్న బస్ స్టాప్ సమీపానికి చేరుకోగానే,నాచారం వైపు నుండి చిల్కానగర్ వైపు ఎదురుగా వస్తున్న పల్సర్ మోటార్ సైకిల్ రైడర్ తీవ్ర అతివేగంతో,అజాగ్రత్తగా వచ్చి వీరి ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టాడు.ఈ ప్రమాద ధాటికి తీవ్ర రక్తస్రావ గాయాలతో రోడ్డుపై పడిపోయిన అభిలాష్, సందీప్‌లను గమనించిన స్థానికులు వెంటనే గాంధీ ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆస్పత్రి వైద్యులు పరీక్షించి అభిలాష్ అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. వెనుక కూర్చున్న సందీప్ తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సంఘటనపై మృతుని బాబాయి కొమరి దానమయ్య (65, రిటైర్డ్ ఉద్యోగి) నాచారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.అతివేగంగా,నిర్లక్ష్యంగా వాహనం నడిపి యువకుడి మృతికి, మరొకరి గాయాలకు కారణమైన పల్సర్ బైక్ రైడర్‌పై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. కేసు నమోదు చేసుకున్న సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కె. మైబెలి దర్యాప్తు వేగవంతం చేశారు.

# నిరుపేద ప్రతిభకు 'లయన్స్' బాసట

- ప్రభుత్వ బడిలో చదివి.. ఎంబీబీఎస్ సీటు సాధించిన మేఘన
- ఘనంగా సన్మానించి రూ.15,000 ఆర్థిక సహాయం అందించిన లయన్స్ క్లబ్ తొర్రూర్ వినాయక ఫ్రెండ్స్

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) అక్టోబర్ 4:** పేదరికం విద్యకు ఏమాత్రం అడ్డంకి కాదని నిరూపిస్తూ, ప్రభుత్వ పాఠశాల మరియు ప్రభుత్వ కళాశాలల్లోనే చదివి వైద్య విద్య ఎంబీబీఎస్ లో సీటు సాధించి సత్తా చాటింది చెర్లపాలెం గ్రామానికి చెందిన ధర్మారపు మేఘన. ఈ సందర్భంగా మేఘనను లయన్స్ క్లబ్ తొర్రూర్ వినాయక ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించి, ఆమె ఉన్నత చదువుల నిమిత్తం రూ. 15,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.లయన్స్ క్లబ్ తొర్రూర్ వినాయక ఫ్రెండ్స్ అధ్యక్షుడు లయన్ వనం మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ పూర్వ జిల్లా గవర్నర్ లయన్ డా. కుందూరు రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ లయన్ డా. నాగవాణి, జోన్ చైర్మన్ లయన్ ఈ. శ్రీనివాస్ అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నిరుపేద విద్యార్థులకు అండగా నిలవడం లయన్స్ క్లబ్ సామాజిక బాధ్యతలో భాగమని, భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను దిగ్విజయంగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి లయన్ పారిపల్లి శ్రావణ్ కుమార్, కోశాధికారి లయన్ దొడ్డ సిద్ధూ, ఇమిడియట్ పాస్ట్ ప్రెసిడెంట్ లయన్ తల్లాడి హీరాధర్, పాస్ట్ ప్రెసిడెంట్ లయన్ పద్మం యాదగిరి, వైస్ ప్రెసిడెంట్ లయన్ బుదారపు శ్రీనివాస్, లయన్ రాగి శ్రీనివాస చారీలతో పాటు లయన్స్ సభ్యులు లయన్ దేవరకొండ శ్రీనివాస్, లయన్ ఇటికెలా వేణు, లయన్ రేగూరి శ్రీధర్, లయన్ పట్టూరి సోమయ్య, లయన్ మార్గం హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




# రక్తంలో మద్యం... రోడ్డుపై మరణం

- మల్కాజిగిరి పోలీస్ స్పెషల్ డ్రైవ్
- మందుబాబుల గుండెల్లో రైళ్లు

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),అక్టోబర్4:** రహదారిపై మీ సరదా... ఇంకొకరి ప్రాణాలకు గండం కాకూడదు మద్యం మత్తులో వాహనం నడిపే ప్రబుద్ధులపై మల్కాజిగిరి కమిషనరేట్ ట్రాఫిక్ పోలీసులు కరచాలనం కాకుండా, ఉక్కుపాదం మోపారు. సెప్టెంబర్ 27 నుండి అక్టోబర్ 3 మధ్య రాత్రి వేళల్లో విరుచుకుపడిన పోలీసులు,ఏకంగా 144 మంది మందుబాబుల ఆట కట్టించారు. **ఏ వాహనంలో ఎంతమంది పట్టుబడ్డారు?:** మద్యం మత్తులో వాహనం నడిపి చిక్కిన వారి జాబితా ఇక్కడ చూడండి: టూ వీలర్లు (ద్విచక్ర వాహనాలు): 120 మంది (అత్యధికంగా చిక్కింది వీరే!) ఆటోలు (త్రీ వీలర్లు): 06 మంది కార్లు (ఫోర్ వీలర్లు): 17 మంది హెవీ వెహికల్స్ (భారీ వాహనాలు): 01 రక్తంలో ఆల్కహాల్ మోతాదు ఎంత ఉందంటే? రక్తంలో ఆల్కహాల్ పరిమాణాన్ని బట్టి పోలీసులు డేటాని ఇలా వర్గీకరించారు: 36 ఎంజీ నుండి 200ఎంజీ వరకు: 135 మంది 201 ఎంజీ నుండి 300ఎంజీ వరకు: 09 మంది ఈ 144 మందిని కోర్టు ముందు నిలబెట్టేందుకు పోలీసులు రంగం సిద్ధం చేశారు. గత వారంలో కోర్టు ముందు హాజరుపరిచిన 27 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులకు సంబంధించి న్యాయస్థానం ఇచ్చే తీర్పులు ఇలా ఉన్నాయి: జైలు శిక్ష , జరిమానా: 2 మందికి సామాజిక సేవ,జరిమానా: 4 మందికి కేవలం జరిమానా: 21 మందికి బిఎన్ఎస్ సెక్షన్ 105అంటే ఏంటో తెలుసా?: తాగి వాహనం తోలడం కేవలం చలానాతో పోయే చిన్న నేరం అనుకుంటే పప్పులో కాలేసినట్టే. మీ నిర్లక్ష్యం వల్ల ఏ చిన్న ప్రాణాంతక ప్రమాదం జరిగినా,నూతన చట్టం భారతీయ నస్య సంహిత, 2023 లోని సెక్షన్ 105 కింద కేసు నమోదు చేస్తారు.ఏకంగా 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు భారీ జరిమానా కూడా విధిస్తారు.మద్యం మైకంలో వాహనం నడపకండి... ఇంట్లో మీ కోసం ఎదురుచూసే కుటుంబాన్ని బలిచేయకండి. -ట్రాఫిక్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్,మల్కాజిగిరి కమిషనరేట్ హెచ్చరిక


TELANGANA POLICE

MALKAJGIRI COMMISSIONERATE
TRAFFIC POLICE
PRESS NOTE

Malkajgiri Commissionerate Traffic Police have conducted a special drunk driving enforcement drive over the weekend (27.09.2026 to 03.10.2026), resulting in the apprehension of (144) offenders.

| VEHICLE-WISE BREAKDOWN OF THE CASES IS AS FOLLOWS: | |
|---|---|
| Two wheelers: | 120 |
| Three wheelers: | 06 |
| Four wheelers: | 17 |
| Heavy Wheelers: | 01 |

| GENDER-WISE BREAKDOWN OF THE CASES IS AS FOLLOWS: | |
|---|---|
| Male: | 144 |
| Female: | 00 |

OFFENDERS WERE CATEGORIZED BASED ON THEIR BLOOD ALCOHOL CONCENTRATION (BAC) LEVELS:

- (135) offenders had BAC levels ranging from 36 mg/100 ml to 200 mg/100 ml,
- (09) offenders had BAC levels ranging from 201 mg/100 ml to 300 mg/100 ml,
- (00) offenders had BAC levels above 300 mg/100 ml.

All the offenders will be produced before the Hon'ble Court.
Malkajgiri Commissionerate Traffic Police reiterate that driving under the influence of alcohol is a serious offence. If anyone is found to be driving in an inebriated condition and causes a fatal accident, such individuals will be booked under Section 105 of the Bharatiya Nyaya Sanhita, 2023 (Culpable Homicide Not Amounting to Murder). The maximum punishment under this section is 10 years of imprisonment along with a fine.

IN THE LAST WEEK (27.09.2026 TO 03.10.2026)
Total 27 DD cases were disposed in the Hon'ble courts, in which

- (02) respondents was given Fine and Jail.
- (04) respondents were given Fine and social service.
- (21) Respondents were imposed with a fine only.

DON'T DRINK & DRIVE YOUR FAMILY IS WAITING
DON'T DRINK & DRIVE | WEAR HELMET | OBEY TRAFFIC RULES | DON'T USE MOBILE WHILE DRIVING | WEAR SEAT BELT

@mkjtraffic | Malkajgiri Traffic Police | @MKJTRAFFIC | TRAFFIC HELPLINE 8712662999 | Drive Safe Stay Safe

Dy. Commissioner of Police, Traffic, Malkajgiri Commissionerate

# జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- ఉప్పల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఇన్సూరెన్స్ బాండ్ల పంపిణీ
- ముఖ్య అతిథిగా పాల్గొని అందజేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి







**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),అక్టోబరు4:** జర్నలిస్టుల సంక్షేమానికి ఎల్లవేళలా తనవంతు పూర్తి సహకారం అందిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు.ఉప్పల్ ప్రెస్ క్లబ్ (ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా) ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కమిటీ సభ్యులకు ఇన్సూరెన్స్ బాండ్లను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వడ్డేపల్లి కిషోర్, ప్రధాన కార్యదర్శి ఆనంద నరసింహారెడ్డిల నాయకత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గుడి మధుసూదన్ రెడ్డి ఆర్థిక సౌజన్యంతో సభ్యులకు ఈ ఇన్సూరెన్స్ రక్షణను కల్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...నిత్యం సమాజంలో ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తూ, అభివృద్ధికి తోడ్పడుతున్న జర్నలిస్టుల శ్రమ అభినందనీయం. వారి భద్రత, సంక్షేమానికి ఇలాంటి ఇన్సూరెన్స్ కవరేజీ ఎంతగానో ఉపయోగపడుతుంది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గుడి మధుసూదన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, నాయకులు గంధం నాగేశ్వర్ రావు, నేర్ధం భాస్కర్ గౌడ్, ఈరెల్లి రవీందర్ రెడ్డి, తిరుమలేష్, కొంపల్లి రవీందర్, పల్లె రాజకుమార్ గౌడ్, గడ్డం పాపి రెడ్డి, పిట్టల నరేష్ పాల్గొన్నారు.ప్రెస్ క్లబ్ ప్రతినిధులు వడ్డేపల్లి కిషోర్, ఆనంద నరసింహారెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధి సీసా నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ బోడ ప్రవీణ్, ఇడపాక సురేష్, ఇతర కమిటీ సభ్యులు ,వివిధ రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు.

# ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవతో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

- తండా ప్రజల చిరకాల విద్యుత్ సమస్యకు పరిష్కారం

**తొలి అక్షరం/నెక్కొండ, అక్టోబర్ 4:**వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని లావుడ్యా వాగ్య నాయక్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని గోలియా తండాలో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవతో ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్ స్తంభాలు, వైర్లు ఏర్పాటు చేయడంతో తండా ప్రజల చిరకాల విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది.ఇటీవల హైదరాబాద్‌లో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని కలిసిన తండా సర్పంచ్ భూక్య బాజీ మిట్టు గ్రామంలోని విద్యుత్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి నూతన ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు, వైర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు.నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో తండాలో విద్యుత్ సరఫరా సమస్యలు తగ్గి ప్రజలకు మెరుగైన విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి రానుంది. తమ సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి సర్పంచ్ భూక్య బాజీ మిట్టుతో పాటు తండా ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



# రాచకొండ వైభవానికి కొత్త శోభ.. దసరా ఉత్సవాలకు ఇ ఎల్ వి భాస్కర్ శ్రీకారం!

**- రాచకొండను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం.. ప్రాచీన దేవాలయాల పునర్నిర్మాణానికి కృషి**



**తొలి అక్షరం/చౌటుప్పల్: అక్టోబర్ 4:** రాచకొండ చారిత్రక వైభవాన్ని ప్రపంచానికి చాటడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా రాచకొండ దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఇఎల్వి భాస్కర్ ఫౌండేషన్ అధినేత ఇరుగుదిండ్ల భాస్కర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. రాచకొండ దసరా ఉత్సవాల సమితి, ఇఎల్వి భాస్కర్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించనున్న ఉత్సవాల కరపత్రికను ఆదివారం రాచకొండ రామాలయం వద్ద భాస్కర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇఎల్వి భాస్కర్ మాట్లాడుతూ అక్టోబర్ 11 నుంచి 17వ తేదీ వరకు మునుగోడు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సినీ, జానపద కళాకారులతో ఆటపాటలు, బతుకమ్మ సంబరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 22న ఘట్టుప్పల మండలంలో దసరా సంబరాలను ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఉత్సవాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. రాచకొండను పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దడమే తన అంతిమ లక్ష్యమని భాస్కర్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న రాచకొండను అభివృద్ధి చేస్తే పరిసర గ్రామాలు కూడా అభివృద్ధి చెంది, స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. రాచకొండలోని ప్రాచీన దేవాలయాల పునర్నిర్మాణానికి తన వంతు కృషి ఎప్పటికీ కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాచకొండ సమితి అధ్యక్షుడు బద్దుల కృష్ణకుమార్, అల్లాపురం సర్పంచ్ టేకుల మంజుల దిలీప్‌రెడ్డి, వివిధ గ్రామాల ప్రజలు, ఇఎల్వి భాస్కర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# తెలంగాణలో జనసేన సమరశంఖం

**- ఎమ్మెల్సీ ఎన్నికలతో మార్పుకు శ్రీకారం: డా. గడల శ్రీనివాసరావు**





**తొలి అక్షరం/చౌటుప్పల్: అక్టోబర్ 4:** తెలంగాణలో ప్రజా సమస్యలపై గళమెత్తేందుకు జనసేన సిద్ధంగా ఉందని ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, నల్గొండఖమ్మంవరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా చౌటుప్పల్‌లో నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆయన విమర్శించారు. ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, మహిళలకు నెలకు రూ.2,500 తదితర హామీల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించడమే జనసేన లక్ష్యమని, ఎమ్మెల్సీ ఎన్నికలు పార్టీకి కీలకమని తెలిపారు. పట్టభద్రులు తనకు మద్దతు ఇచ్చి గెలిపించాలని కోరారు. పవన్ కళ్యాణ్ తెలంగాణ పర్యటనతో రాష్ట్ర రాజకీయాల్లో మార్పు వస్తుందని అన్నారు. **జనసేనకు రూ.లక్ష విరాళం** జనసేన ఉమ్మడి నల్గొండ జిల్లా నాయకుడు ఆముదాల పరమేశ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు ఎన్నికల ప్రచార ఖర్చుల కోసం రూ.లక్ష చెక్కును విరాళంగా అందజేశారు. పార్టీ సభ్యత్వాల నమోదులో చురుకుగా పనిచేసిన నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో మమ్ము రెడ్డి ప్రేమ్‌కుమార్, మచ్చ సుధాకర్, శిరీష, ప్రజిత్ గౌడ్, మిర్యాల రామకృష్ణ, శివ కార్తీక్, లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రాచకొండ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యం

**- రాచకొండ కోట గొప్పతనాన్ని ప్రపంచానికి చాటండి.. పాత్రికేయులకే సాధ్యం: డా. ఈఎల్వి భాస్కర్**



**తొలి అక్షరం/చౌటుప్పల్: అక్టోబర్ 4:** చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలిచిన రాచకొండ కోట ప్రాముఖ్యతను ప్రపంచానికి పరిచయం చేయడమే తన లక్ష్యమని ఈఎల్వి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. ఈఎల్వి భాస్కర్ అన్నారు. రాచకొండ దసరా ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాచకొండ చరిత్ర, సంస్కృతి, వారసత్వ సంపదను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో పాత్రికేయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. రాచకొండకు గొప్ప చారిత్రక నేపథ్యం ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో ప్రచారం లభించలేదన్నారు. రాచకొండ కోట కేవలం ఒక నిర్మాణం కాదని, పూర్వీకుల చరిత్ర, సంస్కృతి, నిర్మాణ వైభవానికి సజీవ సాక్ష్యమని తెలిపారు. "మీ కలంతో రాచకొండ చరిత్రను ప్రపంచానికి చేర్చండి. కోట గొప్పతనాన్ని విశ్వవ్యాప్తం చేయండి.. అది మీతోనే సాధ్యం" అని పాత్రికేయులకు పిలుపునిచ్చారు. రాచకొండ కోటను కేంద్రంగా చేసుకుని పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తే స్థానిక ప్రాంతానికి కొత్త అవకాశాలు ఏర్పడి, యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. ప్రభుత్వం రాచకొండ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి రహదారులు, మౌలిక వసతులు, పర్యాటక సౌకర్యాలు కల్పించాలని కోరారు. రాచకొండ దసరా ఉత్సవాల ద్వారా ప్రాంత చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రాచకొండకు ప్రపంచస్థాయి గుర్తింపు వచ్చే వరకు తనవంతు ప్రయత్నం కొనసాగిస్తానని డా. ఈఎల్వి భాస్కర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో చౌటుప్పల్ మండల సీనియర్ పాత్రికేయులు పాల్గొన్నారు.

# వరుసగా మూడోసారి జాతీయ స్థాయికి..: కొండోజు వేణు

**బ్యాడ్మింటన్ షటిల్‌లో రాష్ట్రస్థాయి బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులను ఘనంగా సన్మానించిన బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** హైదరాబాద్‌లోని తెలంగాణ పోలీస్ అకాడమీ వేదికగా జరిగిన ఎన్‌జీఓస్ మరియు వరంగల్ లో జరిగిన బ్యాడ్మింటన్ ఓపెన్ మెన్స్ డబుల్స్ విభాగం పోటీల్లో వరంగల్ జిల్లా,కాజీపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ కొండోజు వేణు అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచారు. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో తన ప్రతిభతో ప్రత్యర్థులను చిత్తు చేసి స్వర్ణ పతకాన్ని ముద్దాడారు. అలాగే ఎన్పిడీసీఎల్ రాష్ట్ర స్థాయి షటిల్ వరంగల్ లో జరిగిన పోటీల్లో హరీశ్ యాదవ్ సబ్ ఇంజనీర్,క్రిష్ణకాంత్ ఏఈ లు రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి గెల్చుకున్న సందర్భంగా ఇరువురిని ఘనంగా సన్మానించారు. ఈ విజయంతో కొండోజు వేణు వచ్చే నెలలో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరగబోయే ప్రతిష్టాత్మక "ఆల్ ఇండియా పోలీస్ నేషనల్స్" టోర్నమెంట్‌కు తెలంగాణ పోలీస్ జట్టు తరఫున ఎంపికయ్యారు. ఒక క్రీడాకారుడిగా వరుసగా మూడోసారి జాతీయ స్థాయికి...ఆల్ ఇండియా పోలీస్ నేషనల్స్‌కు ఎంపికవ్వడం కొండోజు వేణు క్రీడా ప్రయాణంలో ఒక అరుదైన మైలురాయి పోలీస్ శాఖలో కఠినమైన బాధ్యతలు నిర్వర్తిస్తూనే,క్రీడల పట్ల ఉన్న అంకితభావంతో మన జేయస్‌యస్‌లో ప్రాక్టీస్ చేస్తున్న ఆయన సాధించిన ఈ విజయం తోటి సిబ్బందికి,అలాగే కాజీపేట,వరంగల్ పోలీస్ కమీషనరేట్‌కు ఎంతో గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా కొండోజు వేణు మాట్లాడుతూ...వరుసగా మూడోసారి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వడం చాలా ఆనందంగా ఉంది. ఈ ప్రయాణంలో నాకు మద్దతుగా నిలిచిన పోలీస్ ఉన్నతాధికారులకు, సహోద్యోగులకు,నన్ను ప్రోత్సహించి అందరి సమక్షంలో సన్మానం చేసిన టిబిఏ హన్మకొండ అధ్యక్షులు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి,జేయస్‌యస్ షటిల్ క్రీడాకారులకు ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు" అని తెలిపారు. ఈ సందర్భంగా బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ...అహ్మదాబాద్‌లో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో కూడా తెలంగాణ రాష్ట్రం తరఫున ప్రతిభ చాటి,బంగారు పతకంతో తిరిగి రావాలని కోరారు. షటిల్ జేయస్‌యస్ క్రీడా మిత్రులు కలసి ఇరువురులను శాలువాలతో ఘనంగా సన్మానించారు మెడల్సు వారి మెడలో వేసారు. వేణు,హరీశ్ యాదవ్,క్రిష్ణకాంత్ లు జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించి రావాలని వారికి బొద్దిరెడ్డి ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో గడ్డం కేశవమూర్తి,కూరపాటి రమేశ్,కొత్తగట్టు శివ,శ్రీకాంత్,విక్రమ్ రెడ్డి,తమ్మడపల్లి రాజు,పీసు రాజారెడ్డి,కొలుగూరి ప్రభాకరరావు, శశి,కె.మదూకర్,కె.సత్యనారాయణ,పి.శ్రనివాస్,వేణు, మహేందర్ రెడ్డి,సంతోష్,రాజు,డాక్టర్ శ్రీధర్, రమణారెడ్డి,చంటి,రఘు,తదితరులు పాల్గొన్నారు.

# ఉపసర్పంచుల హక్కులను కాలరాస్తే సహించేది లేదు!

- అధికారాలు, విధులపై స్పష్టత ఇవ్వాలి.. గౌరవ వేతనం పెంచాలి
- సూర్కంటి శ్రీధర్‌రెడ్డి, జిల్లా ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షులు



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 4:** ఉపసర్పంచుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఉపసర్పంచుల ఫోరం నిర్ణయించింది. భువనగిరి పట్టణంలో మందలోగూడెం గ్రామ ఉపసర్పంచ్, జిల్లా ఫోరం అధ్యక్షులు సూర్కంటి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచుల అధికారాలు, విధులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, గౌరవ వేతనం పెంచాలని, గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో ఉపసర్పంచులకు సముచిత భాగస్వామ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ సమావేశాల్లో ఉపసర్పంచులకు తగిన ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు, వారి సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక సమావేశం నిర్వహించాలని కోరారు. ఉపసర్పంచుల గౌరవానికి భంగం కలిగించే చర్యలను సహించేది లేదని శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. జిల్లాలో ఏ గ్రామంలోనైనా ఉపసర్పంచులపై దాడులు జరిగినా, వారి గౌరవాన్ని కించపరిచినా తీవ్రంగా ప్రతిఘటిస్తామని స్పష్టం చేశారు. హక్కులు, గౌరవం కోసం జిల్లాలోని ఉపసర్పంచులంతా ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పలు గ్రామాల ఉపసర్పంచులను జిల్లా కమిటీలోకి చేర్చారు. రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యులు చిన్నం బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు చిలకల సంతోష్, వెల్దండ కృష్ణారెడ్డి, వడ్డబోయిన వెంకటేష్, లింగారెడ్డి, మండల అధ్యక్షులు బొమ్మకంటి కిషోర్, వెంకటేష్ నాయక్, పార్వతీపురం ఉపసర్పంచ్ నరేందర్, వర్కపల్లి ఉపసర్పంచ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# గడప గడపకు సంక్షేమ ఫలాలు

**- 216 మంది లబ్ధిదారులకు రూ. 1,02,51,000 విలువ గల సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేసిన మంత్రి**



**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి అక్టోబర్ -4:** గడప గడపకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక శ్రీ శ్రీ సర్కిల్ వద్ద గల తన నివాసంలో ఖమ్మం రూరల్, ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని 216 మంది లబ్ధిదారులకు ఒక కోటి 2 లక్షల 51 వేల రూపాయల విలువగల చెక్కులను పంపిణీ చేశారు. ఇందులో ఖమ్మం రూరల్ మండలానికి చెందిన 51 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 70 మంది, ఖమ్మం రూరల్ మండలం పరిధిలోని 95 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆపదలో ఉన్న ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, పేదల కన్నీళ్లు తుడవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. నిరుపేదలకు వైద్య ఖర్చుల భారం కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయ నిధిని వేగంగా అందిస్తున్నామన్నారు. అలాగే ఆడబిడ్డల పెళ్లిళ్లకు కళ్యాణలక్ష్మి పథకం ఎంతో ఆసరాగా నిలుస్తోందని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చర్యలు చేపట్టామన్నారు.

# ఎర్రుపాలెంలో రూ.12.89 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**- గ్రామీణ రహదారులు, ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం**





**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి అక్టోబర్ -4:** మధిరలోని ఎర్రుపాలెం మండలంలో రూ.12.89 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు ఎస్సీ కాలనీల్లో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి ఈ పనులు చేపట్టనున్నారు. ఎర్రుపాలెం నుంచి జమలాపురం వరకు బీటీ రహదారి నిర్మాణానికి రూ.5.35 కోట్లు, ఎర్రుపాలెం ఎస్సీ కాలనీలో అంతర్గత సీసీ రోడ్లకు రూ.55 లక్షలు కేటాయించారు. రామాపురం నుంచి కొత్తపాలెం వరకు బీటీ రహదారి నిర్మాణానికి రూ.6.15 కోట్లు, రామాపురం ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లకు రూ.13 లక్షలు, రెమిడిచర్ల ఎస్సీ కాలనీలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.71 లక్షలు వెచ్చించనున్నారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ఎస్సీ కాలనీల్లో మౌలిక వసతులు బలోపేతం కానున్నాయి. ప్రజలకు మెరుగైన రహదారి, మౌలిక సదుపాయాలు కల్పించే లక్ష్యంతో పనులను చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

# ఘనంగా దుర్గా ఉత్సవాలు.. ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నిక!

**• 20వ సంవత్సరం శరన్నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం..అధ్యక్షుడిగా తాడూరు వెంకటేశం**




**తొలి అక్షరం/చౌటుప్పల్: అక్టోబర్4:** చౌటుప్పల్ పట్టణంలోని గాంధీ పార్క్‌లో శ్రీ దుర్గా ఉత్సవ కమిటీ 20వ సంవత్సరం నూతన కార్యవర్గాన్ని కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా చౌటుప్పల్ పురపాలక చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్, ముత్యాల హనుమంతు రెడ్డిలను ఎన్నుకోగా, అధ్యక్షుడిగా తాడూరు వెంకటేశం, ప్రధాన కార్యదర్శిగా జక్కర్తి శేఖర్‌ను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు తాడూరు వెంకటేశం మాట్లాడుతూ 20వ సంవత్సరం శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు కమిటీ సభ్యులు, భక్తులు సహకరించాలని కోరారు.తనను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న కమిటీ సభ్యులకు తాడూరు వెంకటేశం కృతజ్ఞతలు తెలిపారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరి సహకారం తీసుకుంటామని చెప్పారు.

# వరంగల్‌లో ఘనంగా ఉత్తమ ప్రైవేట్ ఉపాధ్యాయుల సన్మానం

**విద్యార్థుల భవితవ్యం తరగతి గదిలోనే నిర్మితమవుతుంది: శ్రీరాముల నాగేశ్వర్**






**తొలి అక్షరం/నెక్కొండ, అక్టోబర్ 4:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు ట్రస్మ2026 ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉర్సుగుట్టలోని నాని గార్డెన్స్‌లో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం జరిగింది.కార్యక్రమానికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వరంగల్ డీఈవో బి. రంగయ్యనాయుడు, కార్యక్రమ నిర్వాహక కమిటీ ప్రతినిధి, వరంగల్ జిల్లా అధ్యక్షులు చల్లా నాగార్జున్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యారంగంలో విశేష సేవలు అందించిన ఉత్తమ ఉపాధ్యాయులను అవార్డులతో సత్కరించారు.“విద్యార్థుల భవితవ్యం తరగతి గదిలోనే నిర్మితమవుతుంది” అని క్రాంతి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీరాముల నాగేశ్వర్ అన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని సూచించారు.క్రాంతి హైస్కూల్ చంద్రుగొండకు చెందిన చిర్రబోయిన సూరయ్య, బిర్రు రమాదేవి తదితర ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాదుల మధుసూదన్, వరంగల్ జిల్లా అధ్యక్షులు చల్లా నాగార్జున్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి భాశెట్టి వెంకటేశ్వర్లు, క్రాంతి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీరాముల నాగేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నెక్కొండలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు

**- పట్టణ అధ్యక్షులు ఈదునూరి సాయికృష్ణకు ఘన సన్మానం**



**తొలి అక్షరం/నెక్కొండ, అక్టోబర్ 4:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షులు ఈదునూరి సాయికృష్ణ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేయించి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్‌రెడ్డి, సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లావుడ్యా తిరుమల్ తదితరులు సాయికృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో రామాలయం కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కొనిజెటి బిక్షపతి, నర్సంపేట కోర్టు ఏజీపీ బండి శివకుమార్, మాజీ సొసైటీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ కేవీ సుబ్బారెడ్డి, గుంటుపల్లి ప్రభాకర్‌రావు, ఓబీసీ జిల్లా కార్యదర్శి రాచకొండ రఘు, సోషల్ మీడియా కన్వీనర్ రావుల తిరుపతిరెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు భూక్యా రమేష్ రాథోడ్, మాజీ విద్యా కమిటీ చైర్మన్ గరికపాటి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు

# నూతన వ్యాపార కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని..

**• నాణ్యమైన వస్త్రాలను ప్రజలకు అందుబాటు ధరల్లో అందించాలి.. • వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధితో పాటు వ్యాపార రంగం అభివృద్ధి చెందాలి**




**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని నయీమ్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్జిఎమ్ కాకతీయ ఫ్యాబ్రిక్,యునైటెడ్ హక్ వస్త్ర షోరూమ్‌లను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధితో పాటు వ్యాపార రంగం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.అనంతరం మాట్లాడుతూ... పండుగ వేళ నూతనంగా ప్రారంభించిన వ్యాపార సంస్థలు దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ప్రజలకు నాణ్యమైన వస్త్రాలను అందుబాటు ధరల్లో అందిస్తూ వినియోగదారుల ఆదరణ పొందాలని షోరూమ్ నిర్వాహకులకు సూచించారు.నూతన వ్యాపారాల ద్వారా స్థానికంగా ఆర్థిక కార్యకలాపాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.తమ ఆహ్వానాన్ని మన్నించి షోరూమ్‌ల ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఘనంగా సన్మానించారు.

# రెండు డి.ఏలను విడుదల చేసిన ప్రభుత్వానికి ధన్యవాదాలు

**- టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు గాజే వేణుగోపాల్**



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** ఉద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ప్రధాన సమస్యల్లో ఒకటైన పెండింగ్ డి.ఏలలో రెండు డి ఏ లకు ప్రభుత్వం ఆమోదం తెలిపినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉపముఖ్యమంత్రి మల్లు బట్టు విక్రమార్క,మంత్రివర్గ సభ్యులందరికీ,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి,ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి,తెలంగాణ ఎన్జీవోల సంఘం వరంగల్ జిల్లా పక్షాన ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేస్తూ,మిగతా పెండింగ్ సమస్యల పట్ల కూడా వెంటనే పరిష్కారం చూపిస్తారని,ప్రధానంగా పి.ఆర్.సి రిపోర్టును తెప్పించుకొని 51 శాతం ఫిట్మెంట్ తో నూతన పేస్కేళ్ళ అమలు చేయాలని,మిగిలిన పెండింగ్ డీఏలను విడుదల చేయాలని,పెండింగ్ బిల్లుల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగ పెన్షనర్ల బిల్లులు అన్ని మంజూరు చేయాలని,సిపిఎస్ రద్దు మరియు పాత పెన్షన్ విదానం అమలు కోసం చర్యలు తీసుకోవాలని,హెల్త్ కార్డుల అమలులో తలెత్తుతున్న సమస్యలన్నింటినీ పరిష్కరించాలని ,అలాగే ప్రభుత్వం మీద ఎలాంటి ఆర్థిక భారం పడని సమస్యలను ప్రత్యేకంగా పరిష్కరిస్తారని ఆశిస్తున్నాం అన్నారు.ఉద్యోగ సంఘాల జేఏసీకి ఇచ్చిన హామీ మేరకు రెండు డి ఏ లను ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వానికి మరొకసారి కృతజ్ఞతలు,ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు గాజే వేణుగోపాల్,కార్యదర్శి పాలకుర్తి సదానందం తెలిపారు.అలాగే సమస్యల పరిష్కా రానికి అహర్నిశలు కృషి చేసిన టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్,ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేనీ ముజీబ్ లకు ధన్యవాదాలు తెలిపారు.

# బెంగాల్‌లో సీపీఎం సభపై దాడికి నిరసన

**- పది మందికి తీవ్ర గాయాలు.. పోలీసుల సమక్షంలోనే వేదిక ధ్వంసం**



**తొలి అక్షరం/నెక్కొండ, అక్టోబర్ 4:** పశ్చిమ బెంగాల్‌లో సీపీఎం నిర్వహించిన బహిరంగ సభపై జరిగిన దాడిని నిరసిస్తూ నెక్కొండ మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నాయకులు బొడ్డుపల్లి వెంకన్న మాట్లాడుతూ.. బిపణి మోర్ వద్ద సీపీఎం నిర్వహిస్తున్న సభపై బీజేపీ కార్యకర్తలు దాడి చేశారని ఆరోపించారు.ఈ దాడిలో సీపీఎం కార్యకర్తలకు గాయాలయ్యాయని, సుమారు పది మంది తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. సభా వేదికను ధ్వంసం చేసి, అక్కడి సామగ్రిని పగలగొట్టి విసిరివేశారని, మహిళా కార్యకర్తలపై కూడా దాడి చేశారని ఆరోపించారు. ఈ ఘటన పోలీసుల సమక్షంలోనే చోటుచేసుకోవడం ఆందోళనకరమన్నారు.బీజేపీ దాడికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయని తెలిపారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు కమ్యూనిస్టులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని వెంకన్న హెచ్చరించారు. కార్యక్రమంలో ఉండ్రాతి రాజు, చిరబోయిన యాదగిరి, బొడ్డు రవి, లింగాల మల్లయ్య, ఉండ్రాతి వెంకన్న పటేల్, లచ్చమ్మ, గజ్జెల గోపాల్ తదితర సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నూతన పట్టు వస్త్రాలంకరణలో పాల్గొన్న దైద రవీందర్



**తొలి అక్షరం/రామన్నపేట, అక్టోబర్ 4:** కేతేపల్లి మండలం చీకటిగూడెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీటీసీ దాచేపల్లి నాగేశ్వరరావు కుమార్తెలు హర్షిత, అక్షిత నూతన పట్టు వస్త్రాలంకరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్, డీసీఎంఎస్ చైర్మన్ బొల్లా వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై చిన్నారులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా దైద రవీందర్ మాట్లాడుతూ చిన్నారులు ఆయురారోగ్యాలతో, ఉన్నత విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# గుబ్బగుర్తిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**- సన్న రకాల ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్**



**తొలి అక్షరం/కొణిజర్ల, అక్టోబర్ 4:** కొణిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలోని పెద్దమర్రి వద్ద 202627 వానాకాలం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ దంతాల ప్రశాంతి నరసింహారావు ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రా లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సన్న రకాల వరి ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ అందించనున్నట్లు తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధరతో పాటు బోనస్ పొందాలని కోరారు.కొనుగోలు కేంద్రం ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు పనిచేస్తుందని తెలిపారు. రైతులు సమాచారం కోసం ఏఈఓ 9281037121, వీఓఏ 6300363688 నంబర్లను సంప్రదించాలని సూచి ంచారు. గోపవరం సొసైటీ డైరెక్టర్ మీర్జా ఖాసింబేగ్, సున్నా వీరభద్రరావు, అడపా రామారావు, తాటి శ్రీనివా సరావు, దంతాల నాగయ్య, సీసీ ఎం.కృష్ణయ్య, వీఓఏలు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పార్టీలకు అతీతంగా అభివృద్ధి..

● 33 నెలల్లో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు ● అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాల తప్పుడు ప్రచారం ● ప్రజల అభ్యున్నతి,అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ధ్యేయం పశ్చిమ ఎమ్మెల్యే నాయిని ● రూ.2.60 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన







**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడిన గడిచిన 33 నెలల్లో నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు.31వ డివిజన్ పరిధిలోని అవంతి స్కూల్ కాలనీ,హంటర్ రోడ్ విశాల్ మార్ట్ ఆవరణ శ్రీ అభయ ఆంజనేయ కాలనీ,సూర్యోదయ కాలనీ,శ్రీరామ్ హిల్స్, హంటర్ హిల్స్ రోడ్ నంబర్ 3 ప్రాంతాల్లో సుమారు రూ.2.60 కోట్లతో చేపట్టనున్న అంతర్గత రోడ్లు,సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నాయిని శంకుస్థాపన చేశారు.స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు,కాలనీ ప్రజలు,సంబంధిత అధికారులతో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ...ప్రజల అవసరాలను గుర్తించి ప్రతి డివిజన్‌లో ప్రాధాన్యత క్రమంలో రోడ్లు,డ్రైనేజీలు,మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త పనులను కూడా వేగంగా చేపడుతున్నామని తెలిపారు.ప్రజల అభ్యున్నతి,నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.అభివృద్ధి పనులు జరుగుతుండటాన్ని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు.తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని,క్షేత్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజలు స్వయంగా పరిశీలించాలని కోరారు.నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే నాయిని తెలిపారు.అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో రాజీ లేకుండా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పీసీసీ మెంబర్ బత్తిని శ్రీనివాస్ రావు,డివిజన్ ఇంచార్జ్ మార్క విజయ్ కుమార్,మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు,వేల్పుల మోహన్ రావు,జిల్లా నాయకులు మామిండ్ల సురేష్,డివిజన్ అధ్యక్షుడు సత్తు రమేష్,మాజీ అధ్యక్షులు సురేందర్,నాయకులు వేణు,కృష్ణ,అభిలాష్ స్థానిక నాయకులు,కార్యకర్తలు,అధికారులు,కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా వేమవరం ప్రసన్న-రత్నాకర్ బాబు 23వ వర్ధంతి

- విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య





**తొలి అక్షరం/రామన్నపేట, అక్టోబర్ 4:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం జనంపల్లి గ్రామంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ స్వర్గీయ వేమవరం ప్రసన్న-రత్నాకర్ బాబు 23వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిరుమర్తి లింగయ్య పూలమాల వేసి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.లింగయ్య మాట్లాడుతూ.. ప్రసన్న-రత్నాకర్ బాబు ప్రజా సేవకు అంకితమైన నాయకుడని కొనియాడా రు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, రహదారులు, విద్య, వైద్య రంగాల అభివృద్ధికి విశేష కృషి చేశారని గుర్తు చేశారు. పదవిలో ఉన్నా లేకున్నా ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు.ఆయన భౌతికంగా దూరమైనా ప్రజా సేవ, అభివృద్ధిపై చూపిన ఆశయాలు నేటికీ స్ఫూర్తినిస్తున్నాయని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మండల అధ్యక్షులు, సర్పంచు లు, ఎంపీటీసీలు, యువజన నాయకులు, వేమవరం కుటుంబ సభ్యులు, మాజీ ఎంపీటీసీ వేమవరం సుధీర్‌బాబు దంప తులు, అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# మూడేళ్ల పాలన.. మునుగోడు సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే!

- డిండి ప్రాజెక్టుపై ఎమ్మెల్యే వైఖరి హాస్యాస్పదం.. రహదారులు, ఎగర వంతెన పనులపై బీజేపీ నాయకుడు సృజన్‌కుమార్ గుప్త ధ్వజం

**తొలి అక్షరం/చౌటుప్పల్, అక్టోబర్ 4:**మూడేళ్ల పాలన పూర్తయినా మునుగోడు నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలకు పరిష్కారం లభించలేదని బీజేపీ చౌటుప్పల్ మండల నాయకులు ఊర సృజన్‌కుమార్ గుప్త విమర్శించారు. చౌటుప్పల్‌లో విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి గడువుతో కూడిన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. మునుగోడు నియోజకవర్గానికి కీలకమైన డిండి ఎత్తిపోతల పథకంపై స్థానిక ఎమ్మెల్యే మూడేళ్లలో ముఖ్యమంత్రితో ఒక్కసారి కూడా మాట్లాడలేదని ఆయన ఆరోపించారు. ఇన్నాళ్లూ పట్టించుకోకుండా ఇప్పుడు డిండి ప్రాజెక్టు గురించి మాట్లాడానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. శివన్నగూడెం పథకం పనులు ఎప్పుడు పూర్తవుతాయో స్పష్టం చేయాలని, చౌటుప్పల్ వంద పడకల ఆసుపత్రిని ఎందుకు ప్రారంభించలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చండూరు, చౌటుప్పల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ఏర్పాటుపై కూడా స్పష్టత ఇవ్వాలని కోరారు.**నత్తనడకన ఎగర వంతెన పనులు**చౌటుప్పల్‌సంగెం, చౌటుప్పల్‌వలిగొండ రహదారులు అధ్వానంగా మారినా మరమ్మతులు, విస్తరణ పనులు చేపట్టడం లేదని సృజన్‌కుమార్ గుప్త విమర్శించారు. చౌటుప్పల్ జాతీయ రహదారిపై ఎగర వంతెన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని, దీంతో ట్రాఫిక్ సమస్యలు పెరిగి ప్రజలు, వాహనదా రులు, స్థానిక వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.**ప్రాంతీయ వలయ రహదారి బాధితులకు న్యాయం చేయాలి**ప్రాంతీయ వలయ రహదారి భూసేకరణలో రైతులు, భూ బాధితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నియోజకవర్గంలోని పెండింగ్ సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసి, గడువుతో కూడిన కార్యాచరణ ప్రకటించాలని సృజన్‌కుమార్ గుప్త కోరారు.



# తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

● స్కూళ్ల ఆధునికీకరణ, బ్రిడ్జిల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**తొలి అక్షరం/ఎర్రుపాలెం, అక్టోబర్ 4:**ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజలకు ప్రాథమిక సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. ఎర్రుపాలెం మండలం జమలాపురంలోని వాసిరెడ్డి ఫంక్షన్ హాల్లో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి వివిధ శాఖల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సరఫరాపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించాలని సూచించారు. అధికారులు బాధ్యత, జవాబుదారీతనంతో పనిచేయాలని ఆదేశించారు.మధిర నియోజకవర్గంలోని తొమ్మిది పాఠశాలలను అన్ని సదుపాయాలతో ఆధునికీకరించి మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దేందుకు రూ.59.67 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆధునికీకరణ పనులను వేగవంతం చేసి విద్యార్థులకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన వంతెనల నిర్మాణ పనులను కూడా యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు.మధిర పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో 10 వేల మంది మహిళలకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేలా వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించాలని అధికారులను ఆదేశించారు. డిమాండ్ ఉన్న రంగాల్లో శిక్షణ అందిస్తే మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు.రహదారుల విస్తరణకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాల తరలింపు పనులను సమన్వయంతో వేగంగా పూర్తి చేయాలని, భూ రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని సూచించారు. నిర్ణయించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయడంతో పాటు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.సమావేశంలో ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు టీ. మధుసూదన్, వీ. మోహన్‌రావు, సీఈ గౌతమ్‌రెడ్డి, ఎస్ఈ శ్రీనివాసాచారి, పీఆర్ ఎస్ఈ వెంకట్‌రెడ్డి, తహశీల్దార్ సునీత ఎలిజబెత్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ట్రస్మా ఆధ్వర్యంలో ఘనంగా ఉత్తమ ప్రైవేట్ ఉపాధ్యాయుల సన్మానం










- విద్యార్థుల భవితవ్యం తరగతి గదిలోనే నిర్మితమవుతుంది: చల్లా మమతా యాకుబ్‌రెడ్డి



**తొలి అక్షరం/నెక్కొండ, అక్టోబర్ 4:**వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు ట్రస్మా2026 ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కార్యక్రమాన్ని వరంగల్‌లోని ఉర్సుగుట్ట నాని గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వరంగల్ డీఈఓ బి. రంగయ్యనాయుడు, ట్రస్మా వరంగల్ జిల్లా అధ్యక్షులు, కార్యక్రమ నిర్వాహక కమిటీ సభ్యులు చల్లా నాగార్జున్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సెయింట్ థెరిస్సా హైస్కూల్ కరస్పాండెంట్, ప్రిన్సిపల్ చల్లా మమతా యాకుబ్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల భవితవ్యం తరగతి గదిలోనే నిర్మితమవుతుందని అన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, విద్యారంగంలో విశేష సేవలందిస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని పేర్కొన్నారు.కస్తూరి శ్రీహరి, జనగాం ప్రభావతి, ఈదుల ప్రశాంతి, బానోతు రమేష్‌నాయక్ తదితర ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందజేసి ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాదుల మధుసూదన్, జిల్లా ప్రధాన కార్యదర్శి భాశెట్టి వెంకటేశ్వర్లు, చల్లా మమతా యాకుబ్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఎం. దేవేందర్, రమేష్, లావణ్య, శ్రీకాంత్, బి. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్‌లో బీసీల ఆత్మగౌరవ సభ

- బీసీల హక్కులు, రిజర్వేషన్ల కోసం ఐక్యంగా పోరాడాలి

**తొలి అక్షరం/షాద్‌నగర్, అక్టోబర్ 4:**బీసీల ఆత్మగౌరవం, హక్కులు, రిజర్వేషన్ల సాధన కోసం శంషాబాద్‌లో నిర్వహించిన ఓబీసీ బహిరంగ సభకు షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో బీసీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో బీసీలకు సముచిత వాటా కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు.ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బీసీ యువత భవిష్యత్ కార్యాచరణతో ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో నలముని శ్రీధర్, శ్రీధర్‌వర్మ ముదిరాజ్, నీరటి వాసు, మంగ అశోక్, మేకల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# వెయ్యికి పైగా వాహనాలతో శంషాబాద్‌కు శంకర్ భారీ ర్యాలీ

- శంకర్ ఆధ్వర్యంలో కదిలిన కాంగ్రెస్ దండు.. షాద్‌నగర్ దద్దరిల్లే
- ఓబీసీ సభకు షాద్‌నగర్ నుంచి భారీగా తరలిన కాంగ్రెస్ శ్రేణులు





**తొలి అక్షరం/షాద్ నగర్,అక్టోబర్04:** షాద్‌నగర్ నుంచి శంషాబాద్‌లో నిర్వహించిన ఓబీసీ మహా బహిరంగ సభకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. వెయ్యికి పైగా వాహనాలతో భారీ ర్యాలీగా బయలుదేరిన కార్యకర్తలు కాంగ్రెస్ నినాదాలతో పట్టణాన్ని హోరెత్తించారు. ముందుగా చౌడమ్మగుట్టలో ఆంజనేయస్వామిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. అనంతరం పట్టణ కూడలికి చేరుకున్న ఎమ్మెల్యేకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ నినాదాలు చేశారు. ఓబీసీల హక్కుల సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సామాజిక, రాజకీయ అభివృద్ధికి కులగణన ఎంతో కీలకమన్నారు. బీసీ కులగణన చేపట్టే వరకు కేంద్ర ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సభకు భారీగా తరలివచ్చిన ఓబీసీలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, అగ్గనూర్ బసవేశ్వర్, అందే మోహన్, కేకే కృష్ణ, జాంగారి రవి తదితరులు పాల్గొన్నారు.

# సిద్దాపూర్ డంపింగ్ యార్డు జీవో 641 రద్దు చేయాలి

**- నిరవధిక నిరాహార దీక్షలకు మద్దతు తెలిపిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**




**తొలి అక్షరం/షాద్ నగర్,అక్టోబర్ 04:** సిద్దాపూర్ గ్రామంలో ఎకో టౌన్ పేరుతో ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 641ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలకు మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మద్దతు తెలిపారు. దీక్షా శిబిరాన్ని సందర్శించి ఉద్యమకారులకు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ విజయ్ హాజరుకాగా, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ... డంపింగ్ యార్డు ఏర్పాటుతో ప్రజల ఆరోగ్యం, పర్యావరణం, భూగర్భ జలాలకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాల కాలుష్య సమస్యలు ఉన్నాయని, ప్రజలకు నష్టం కలిగించే డంపింగ్ యార్డు ఏర్పాటును ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల అభిప్రాయాలకు గౌరవం ఇచ్చి జీవో 641ను రద్దు చేయాలని, ప్రజల న్యాయమైన పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ రాంబల్ నాయక్, కన్వీనర్ పినపాక ప్రభాకర్, సామాజికవేత్త వనమాల, జేఏసీ నాయకులు, వివిధ పార్టీల నాయకులు, యువత, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీతారామ ప్రాజెక్టుతో తాగు, సాగునీటి సమస్యకు పరిష్కారం

**- మహబూబాబాద్ ఎమ్మెల్యే డా. భూక్యా మురళీనాయక్**



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో అక్టోబర్ 4:** సీతారామ ప్రాజెక్టు నిర్మాణంతో నియోజకవర్గంలో తాగునీరు, సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందని మహబూబాబాద్ ఎమ్మెల్యే డా. భూక్యా మురళీనాయక్ అన్నారు. ఆదివారం వైరా నియోజకవర్గం కారేపల్లి మండలం చీమలపాడు గ్రామంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి సీతారామ ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టు కుడి కాలువ నిర్మాణం, నీటి ప్రవాహం, ఇల్లందు నుంచి మహబూబాబాద్ నియోజకవర్గానికి నీటిని తరలించే అవకాశాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రాజెక్టు నీటిని సమర్థవంతంగా వినియోగిస్తే రెండు నియోజకవర్గాల్లోని లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా అందుబాటులో ఉన్న నీటి వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్‌నాయక్, మూల మధుకర్‌రెడ్డి, వేలపుల శ్రీనివాస్, నీటిపారుదల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

**- కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రతకు ప్రాధాన్యం: ఎమ్మెల్యే డా. భూక్యా మురళీనాయక్**






**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో అక్టోబర్ 4:** ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మహబూబాబాద్ ఎమ్మెల్యే డా. భూక్యా మురళీనాయక్ తెలిపారు. ఆర్టీసీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం మహబూబాబాద్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొని కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థను బలోపేతం చేయడంతో పాటు కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తోందని తెలిపారు. ఉద్యోగ భద్రత, మెరుగైన పని పరిస్థితులు, సంక్షేమం వంటి అంశాలపై కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఆర్టీసీ సంస్థ ప్రజలకు నిత్యం సేవలందిస్తూ రాష్ట్ర ప్రజా రవాణాలో కీలక పాత్ర పోషిస్తోందని, సంస్థను మరింత బలోపేతం చేయడంలో కార్మికుల పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపడం ద్వారా సంస్థ అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్టీసీ ఎన్నికల్లో కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం పనిచేసే అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. కార్మికుల ఐక్యతతోనే సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని అన్నారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్ ఐక్య కూటమి అభ్యర్థులకు మద్దతుగా నాయకులు, కార్మికులు ప్రచారం నిర్వహించారు. కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత, మెరుగైన పని పరిస్థితుల కోసం ఐక్యంగా పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు. టిడబ్ల్యూయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు, ఆర్టీసీ కార్మికులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గోపయ్య జీవితం.. ఓ పరిపూర్ణ ప్రస్థానం

**- వేలాది విద్యార్థుల జీవితాలకు వెలుగులు పంచిన ఉపాధ్యాయుడు..**

**- నేటి యువతకు విలువల బాట చూపిన మహనీయుడు**

**- వృద్ధాప్యాన్ని గౌరవంగా చూసుకోవడమే నిజమైన నివాళి**





**తొలి అక్షరం/ఖమ్మం అక్టోబర్ 4 :** ఓ ఉపాధ్యాయుడిగా వేలాది మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి.. వారి జీవితాల్లో వెలుగులు నింపి.. 95 ఏళ్ల సుదీర్ఘ జీవితాన్ని విలువలు, మానవీయతతో సాగించిన రిటైర్డ్ ప్రధానోపాధ్యా యుడు గోపయ్య జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయమని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. సుబ్బయ్య, తాళ్లూరి వేణు అన్నారు. ఖమ్మం గాంధీచౌక్‌లోని ఫంక్షన్‌హాల్‌లో శ్రీనివాస్ అధ్యక్షతన రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు గోపయ్య సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం. సుబ్బయ్య, తాళ్లూరి వేణు, గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోదుగు వేలాద్రి లు మాట్లాడుతూ.. గోపయ్య కేవలం ఉపాధ్యాయుడిగానే కాకుండా, విలువలకు నిలువెత్తు నిదర్శనంగా జీవించారని కొనియాడారు. వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్ది సమాజానికి అందించడం ఆయన జీవితానికి దక్కిన గొప్ప గౌరవమని పేర్కొన్నారు. 95 ఏళ్ల జీవితాన్ని సంతృప్తిగా, ఆదర్శప్రాయంగా గడిపిన గోపయ్య సేవలు ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. ఆయన చూపిన విలువల బాటలో నడవడమే ఆయనకు అందించే అసలైన నివాళి అని తెలిపారు. వృద్ధాప్యం జీవితానికి చివరి దశ కాదని.. అనుభవాల సంపదను పంచే విలువైన దశ అని అన్నారు. తల్లిదండ్రులు, వృద్ధులను కుటుంబ సభ్యులు ఆప్యాయతతో, గౌరవంతో చూసుకోవాలని సూచించారు. వృద్ధుల కళ్లలో కనిపించే సంతృప్తి.. కుటుంబానికి లభించే అతిపెద్ద ఆశీర్వాదమని పేర్కొన్నారు. గోపయ్య వృద్ధాప్యంలో ఆయన కుటుంబ సభ్యులు చూపిన శ్రద్ధ, గౌరవం అభినందనీయమని అన్నారు. గోపయ్య భౌతికంగా దూరమైనా.. ఆయన బోధించిన విలువలు, తీర్చిదిద్దిన విద్యార్థుల జ్ఞాపకాలు, సమాజానికి అందించిన సేవల రూపంలో చిరస్థాయిగా నిలిచిపోతారని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు యలమద్ది వెంకటేశ్వ ర్లు, నగరశాఖ అధ్యక్షులు ఆదినారాయణ, రమణ యాదవ్, ఆంజనేయులు, రాధాకృష్ణ తదితరులు పాల్గొని గోపయ్యకు ఘన నివాళులు అర్పించారు.

# కష్టకాలంలో బిక్షపతి కుటుంబానికి ఆటో యూనియన్ ఆపన్నహస్తం

- 10 వేల నగదు, 50 కిలోల బియ్యం అందజేత



**తొలి అక్షరం/మల్లంపల్లి, అక్టోబర్ 4:** కష్టాల్లో ఉన్న తమ సహచర కుటుంబానికి అండగా నిలిచి శ్రీ చైతన్య ఆటో యూనియన్‌మల్లంపల్లి ఆటో యూనియన్ సభ్యులు మానవత్వాన్ని చాటుకున్నారు. యూనియన్‌కు చెందిన మెకానిక్ బిక్షపతి కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని తెలుసుకున్న సభ్యులు తమ వంతు సహాయంగా రూ.10 వేల నగదుతో పాటు 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు మాట్లాడుతూ.. సభ్యులంతా ఒక కుటుంబంలా కలిసిమెలిసి ఉంటామని, ఎవరి కుటుంబానికైనా ఆపద వచ్చినప్పుడు తమకు తోచిన విధంగా అండగా నిలుస్తామని తెలిపారు. కష్టకాలంలో తోటి సభ్యుడికి సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. నగదు, నిత్యావసర సరుకులు అందించడం ద్వారా బిక్షపతి కుటుంబానికి కొంతమేర భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఈ సహాయం చేసినట్లు తెలిపారు. యూనియన్ సభ్యుల సేవాభావాన్ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు మంద కుమార్, కొంగరి నరేందర్, మంద కొమ్మాలు, కోయిల శ్రీనివాస్, ఎంపెల్లి ఎల్లయ్య, ప్రస్తుత అధ్యక్షులు భాషబోయిన సురేష్, ఉపాధ్యక్షులు కొంగరి రమేష్, సలహాదారులు మహ్మద్ ఆఫ్రిద్, ఎండీ అజ్జి, ఎండీ రాజు, ఎండీ షఫీ, కతోజు మురళి, రాపర్తి అనిల్, వరికిల శివాజీ, ఎండీ యాకూబ్ పాషా, జోగు శీను, అందే రాజు తదితరులు పాల్గొన్నారు.

## అతనితో పని చేయడం, స్క్రీన్ షేర్ చేసుకోవడం ఎంతో ప్రత్యేకం



కథ ఎంత ముఖ్యమో.. ఆ కథలో భాగమయ్యే నటీనటులు, సాంకేతిక నిపుణులు కూడా అంతే ముఖ్యమని అంటున్నారు కథానాయిక మాళవిక మోహనన్. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ దక్షిణాది సినిమాలతో పాటు హిందీ చిత్రసీమలోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునేందుకు ఆమె ప్రయత్నిస్తున్నారు. ఇటీవల 'సర్దార్ 2'తో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ భామ.. ప్రస్తుతం విజయ్ సేతుపతితో కలిసి నటించిన 'పాకెట్ నోవెల్' కోసం ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ మాళవిక మోహనన్ సోషల్ మీడియాలో ఓ ఆసక్తికరమైన పోస్ట్ చేశారు. సినిమా షూటింగ్ అనేది కేవలం కెమెరా ముందు నటించడం మాత్రమే కాదని.. ఒక బృందంతో కలిసి నెలల తరబడి ప్రయాణించడం, వారితో ఎన్నో అనుభవాలను పంచుకోవడం కూడా అందులో భాగమేనని ఆమె పేర్కొన్నారు. కొన్ని సినిమాలు చేస్తున్న సమయంలో ఆ చిత్ర బృందమే ఒక ప్రత్యేకమైన ప్రపంచంలా మారిపోతుందని మాళవిక తెలిపారు. ఈ సినిమా ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ మాళవిక మోహనన్ సోషల్ మీడియాలో ఓ ఆసక్తికరమైన పోస్ట్ చేశారు. సినిమా షూటింగ్ అనేది కేవలం కెమెరా ముందు నటించడం మాత్రమే కాదని.. ఒక బృందంతో కలిసి నెలల తరబడి ప్రయాణించడం, వారితో ఎన్నో అనుభవాలను పంచుకోవడం కూడా అందులో భాగమేనని ఆమె పేర్కొన్నారు. కొన్ని సినిమాలు చేస్తున్న సమయంలో ఆ చిత్ర బృందమే ఒక ప్రత్యేకమైన ప్రపంచంలా మారిపోతుందని మాళవిక తెలిపారు. పాకెట్ నోవెల్ కూడా తనకు అలాంటి అనుభూతినే ఇచ్చిందని చెప్పారు. ఈ సినిమాలో భాగం కావడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. షూటింగ్ సమయంలో నటీనటులు, సాంకేతిక బృందం కలిసి ఎక్కువ సమయం గడుపుతారని.. రోజులో ఎన్నో గంటలు కలిసి పనిచేస్తూ ఒకరినొకరు అర్థం చేసుకుంటారని మాళవిక వివరించారు. ఈ క్రమంలోనే చిత్ర బృందంలోని వ్యక్తులు తెలియకుండానే కుటుంబ సభ్యుల్లా మారిపోతారని ఆమె అభిప్రాయపడ్డారు. పాకెట్ నోవెల్ కూడా తనకు అలాంటి అనుభూతినే ఇచ్చిందని చెప్పారు. ఈ సినిమాలో భాగం కావడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. షూటింగ్ సమయంలో నటీనటులు, సాంకేతిక బృందం కలిసి ఎక్కువ సమయం గడుపుతారని.. రోజులో ఎన్నో గంటలు కలిసి పనిచేస్తూ ఒకరినొకరు అర్థం చేసుకుంటారని మాళవిక వివరించారు. ఈ క్రమంలోనే చిత్ర బృందంలోని వ్యక్తులు తెలియకుండానే కుటుంబ సభ్యుల్లా మారిపోతారని ఆమె అభిప్రాయపడ్డారు.

## ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాస్ కన్నుమూత



భారతీయ చలనచిత్ర పరిశ్రమలో ప్రయోగాల మాంత్రికుడిగా పేరుగాంచిన ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు (94) కన్నుమూశారు. గత కొంతకాలంగా వయోభారంతో బాధపడుతున్న ఆయన, చెన్నైలోని కావేరి ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణంతో సినీ ప్రపంచం దిగ్భ్రాంతికి గురైంది.సినీ ప్రస్థానం.. 'ప్రయోగాల బాటసింగీతం శ్రీనివాసరావు 1931 సెప్టెంబర్ 21న నెల్లూరు జిల్లా ఉదయగిరిలో జన్మించారు. కేవలం దర్శకుడిగానే కాకుండా రచయితగా, నిర్మాతగా, సంగీత దర్శకుడిగా, నటుడిగా బహుముఖ ప్రతిభను చాటుకున్నారు. తన సుదీర్ఘ సినీ ప్రయాణంలో ఎన్నో అద్భుతాలను సృష్టించిన ఆయన తెలుగుతో పాటు పలు ఇతర భాషల్లో కలిపి మొత్తం 60కి పైగా చిత్రాలకు దర్శకత్వం వహించారు.సినిమా రంగంలో విభిన్నమైన ప్రయోగాలు చేయడంలో ఆయన ఎప్పుడూ ముందుండేవారు. మాటలు (డైలాగులు) లేకుండా మూకీ తరహాలో ఆయన రూపొందించిన పుష్పక విమానం చిత్రం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అలాగే ఆదిత్య 369, భైరవద్వీపం, విచిత్ర సోదరులు, మయూరి, మైఖేల్ మదన కామరాజు, అపూర్వ సహోదరులు, సొమ్మొకడిది సోకొకడిది వంటి ఎన్నో చిరస్మరణీయ చిత్రాలను ప్రేక్షకులకు అందించారు.సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహించిన చివరి చిత్రం సింగ్ గీతం 94 ఏళ్ల వయసులో కూడా ఆయన దర్శకత్వ బాధ్యతలు చేపట్టి విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. చలనచిత్ర రంగానికి ఆయన చేసిన విశేష సేవలకు గాను రెండు జాతీయ పురస్కారాలు, 5 నంది అవార్డులతో పాటు పలు ఫిల్మ్‌ఫేర్ అవార్డులను ఆయన సొంతం చేసుకున్నారు. విలక్షణ దర్శకుడిగా భారతీయ తెరపై తనదైన చెరగని ముద్ర వేసిన సింగీతం శ్రీనివాసరావు మృతి సినీ పరిశ్రమకు తీరని లోటు.సినీ ప్రముఖుల సంతాపంసింగీతం శ్రీనివాస్ మృతిపై ప్రముఖ నటుడు జూనియర్ ఎన్టీఆర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.. ఆయన ఇక లేరనే వార్త తనకు చాలా బాధాకలిగించిందన్నారు.

## మరీ ఎక్కువ అందంగా ఉందని సినిమాల్లో నుంచి తీసేశారు.



కేవలం అందంగా ఉన్నందుకే ఆమె అనేక సినిమాల నుండి తిరస్కరించబడింది. చాలా మంది దర్శకులు ఆమెను ఒక 'మెయిన్‌స్ట్రీమ్' నటిగా భావించి నిరాకరించారు. ఆమె మరెవరో కాదు బాలీవుడ్ నటి దియా మిర్జా. నటి దియా తండ్రి జర్మన్ , తల్లి బెంగాలీ. ఆమె తల్లి తన జర్మన్ తండ్రికి విడాకులు ఇచ్చి తిరిగి వివాహం చేసుకున్నారు. ఈ కారణంగా, దియా తన ఇంటిపేరుగా తల్లిదండ్రులిద్దరి ఇంటిపేర్లను ఉపయోగించరు.మాధవన్, రీమా సేన్ నటించిన తమిళ సూపర్ హిట్ చిత్రం 'మిన్నలే' హిందీ రీమేక్ 2001లో విడుదలైంది. 'రెహనా హై తేరే దిల్ మే' చిత్రంలో మాధవన్ సరసన నటించడం ద్వారా నటి దియా హిందీ చిత్రసీమలో కథానాయికగా అరంగేట్రం చేసింది. ఈ చిత్రంలో మాధవన్, దియాల మధ్య కెమిస్ట్రీ అభిమానులను ఆకట్టుకుని, సినిమాను విజయవంతం చేసింది.మాధవన్, రీమా సేన్ నటించిన తమిళ సూపర్ హిట్ చిత్రం 'మిన్నలే' హిందీ రీమేక్ 2001లో విడుదలైంది. 'రెహనా హై తేరే దిల్ మే' చిత్రంలో మాధవన్ సరసన నటించడం ద్వారా నటి దియా హిందీ చిత్రసీమలో కథానాయికగా అరంగేట్రం చేసింది. ఈ చిత్రంలో మాధవన్, దియాల మధ్య కెమిస్ట్రీ అభిమానులను ఆకట్టుకుని, సినిమాను విజయవంతం చేసింది.తొలి చిత్రంలోనే దియా అందం, నటన గురించి చర్చ జరిగింది. అయినప్పటికీ, ఈ నటి అనేక తిరస్కరణలను ఎదుర్కొంది. నటి దియా మీర్జా మంచి కథలతో కూడిన అర్థవంతమైన చిత్రాలలో నటించడానికి చాలా ఆసక్తి చూపింది. కానీ, ఆమె చాలా అందంగా ఉన్నందున ఆ పాత్రకు సరిపోదని చెబుతూ చిత్ర దర్శకులు ఆమెను తిరస్కరించారు. ఈ విషయాన్ని స్వయంగా బయటపెట్టింది. తొలి చిత్రంలోనే దియా అందం, నటన గురించి చర్చ జరిగింది. అయినప్పటికీ, ఈ నటి అనేక తిరస్కరణలను ఎదుర్కొంది. నటి దియా మీర్జా మంచి కథలతో కూడిన అర్థవంతమైన చిత్రాలలో నటించడానికి చాలా ఆసక్తి చూపింది. కానీ, ఆమె చాలా అందంగా ఉన్నందున ఆ పాత్రకు సరిపోదని చెబుతూ చిత్ర దర్శకులు ఆమెను తిరస్కరించారు. ఈ విషయాన్ని స్వయంగా బయటపెట్టింది. "దర్శకులు నన్ను 'మెయిన్‌స్ట్రీమ్' నటిగా చూడటం వల్ల, నేను కోరుకున్న మంచి కథ ఉన్న సినిమాలో నటించే అవకాశం నాకు లభించలేదు" అని అన్నారు.

## శ్రీకాంత్, ఊహల ప్రేమకథ ఎలా మొదలయ్యిందో తెలుసా..





నటుడు శ్రీకాంత్ మేక, తన వ్యక్తిగత జీవితం, సినీ ప్రస్థానంపై గతంలో ఓ ఇంటర్వ్యూలో అనేక ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ప్రేమ, పెళ్లి గురించి మాట్లాడుతూ, ప్రేమకు నిర్వచనం అండర్‌స్టాండింగ్ అని స్పష్టం చేశారు. కేవలం ఆకర్షణతో కూడిన ప్రేమ శాశ్వతం కాదని, నమ్మకం, పరస్పర అవగాహన బంధాన్ని బలపరుస్తాయని ఆయన వివరించారు. తన సతీమణి ఊహతో ప్రేమ వివాహం చేసుకోవడానికి గల కారణాలను పంచుకున్నారు. ఇద్దరూ కలిసి నాలుగు సినిమాలు చేయగా, ఊహ మెంటాలిటీ, ఆమె సాఫ్ట్ నేచర్ తనకు బాగా నచ్చాయని, తనలో కనిపించిన ఆ లక్షణాలే ఆమె పట్ల ప్రేమకు దారితీశాయని చెప్పారు. శ్రీకాంత్ తన వంటల అభిరుచి గురించి మాట్లాడారు. అప్పుడప్పుడు ఇంట్లో వంటగదిలోకి వెళ్తుంటారా అని అడగ్గా, ఇంట్లో కాదు కానీ, తన స్వగ్రామం కర్ణాటకలోని గంగావతిలో స్నేహితులతో కలిసి వంటలు చేస్తుంటానని తెలిపారు. అక్కడ తమకు ఒక హౌస్ ఉందని, స్నేహితులతో వెళ్లినప్పుడు బయట నుంచి తెప్పించుకోవడం కాకుండా, స్వయంగా వంట కార్యక్రమాలు పెట్టుకుంటామని చెప్పారు. పప్పుచారు, చికెన్ వంటివి కూడా వండుతానని, తన భార్య ఊహకు ఫోన్ చేసి వంట పద్ధతులు కనుక్కుంటానని సరదాగా వెల్లడించారు.తన సినీ కెరీర్ గురించి మాట్లాడుతూ, తనకు బాగా నచ్చిన దర్శకులలో కె. రాఘవేంద్ర రావు, కృష్ణవంశీ ముందుంటారని చెప్పారు. ఈవీవీ సత్యనారాయణ, కృష్ణారెడ్డి, విశ్వనాథ్ అందరూ ఇష్టమే అయినా, కృష్ణవంశీతో తనకు ఎక్కువ ఫ్రెండ్షిప్ ఉందని, "ఒరే ఒరే" అనుకునేంత చనువు ఉందని తెలిపారు. తనతో నటించిన హీరోయిన్స్‌లో సౌందర్య తనకు బాగా సూట్ అయ్యారని అభిప్రాయపడ్డారు.

## ఇలా నిలదొక్కుకోవడం అంటే మామూలు విషయం కాదు



అంతేకాకుండా, ఉదయభాను తన తండ్రి గొప్ప వారసత్వం గురించి అనేక విషయాలు పంచుకున్నారు. తన తండ్రి కలం పేరు కూడా ఉదయభాను అని, ఆయన కోహెడ్‌లో విగ్రహం ఉన్న గొప్ప వ్యక్తి అని తెలిపారు. ఒక వ్యక్తికి ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా ఊర్లో విగ్రహం పెట్టడం అసాధ్యమని, ఇది తన తండ్రి గొప్పతనాన్ని తెలియజేస్తుందని ఉదయభాను అన్నారు. తన తండ్రి రాసిన కవితలన్నీ బయటకు వచ్చి ఉంటే బాగుండేదని, అయితే తాను చిన్నప్పుడే నాన్నకి దూరమవడం వల్ల వాటిని భద్రపరచలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. తన తండ్రి కవితలు విప్లవాత్మకంగా ఉండేవని, అప్పటి పెత్తనం, దొరల మీద ఆయన కవితలు రాసేవారని, ఊరంతా కూర్చొని ఆయన కథలు వినేదని ఊరి ప్రజలు తనకు చెప్పేవారని గుర్తు చేసుకున్నారు.తన తండ్రి గురించి ఒక జ్ఞాపకాన్ని కూడా ఉదయభాను పంచుకున్నారు. ఒక బాపు, రాములు మామ అని పిలవమనే వ్యక్తి, ఒకరోజు తమ ఇంటికి వచ్చి, చిన్నపిల్ల అయిన ఉదయభాను కాళ్ళు పట్టుకొని ముద్దు పెట్టుకున్నాడని, ఆమె వేలును తన తండ్రి వేలితో పోల్చుకొని "నాన్న కాళ్ళు, నాన్న కాళ్ళు" అని ఏడ్చాడని తెలిపారు. ఇది తన తండ్రి పట్ల ప్రజలకు ఉన్న ఆదరాభిమానాలకు నిదర్శనమని పేర్కొన్నారు. తన తండ్రి దాదాపు 150 ఎకరాల భూమిని గ్రామానికి దానం చేశారని, ఆయన ఒక జమీందారని ఊరి ప్రజలు చెప్పేవారని ఉదయభాను వెల్లడించారు. ఆయనకు ఉన్న భావజాలమే ఆ దానానికి కారణమని, అయితే తమ కుటుంబం ఆ ఆస్తి నుంచి ఒక్క చిల్లిగవ్వ కూడా తీసుకోలేదని ఉదయభాను స్పష్టం చేశారు.

## సింగర్స్ లేరని ఆ సినిమాలో పాట పాడిన త్రివిక్రమ్..



దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో హీరో వెంకటేశ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ ఆదర్శ కుటుంబం. ఈ చిత్రాన్ని త్వరలోనే అడియన్స్ ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ క్రమంలోనే ఈ చిత్రం ప్రమోషన్లలో పాల్గొంటున్న త్రివిక్రమ్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తన కెరీర్‌లో అరుదైన గాయకుడిగా మారిన సంఘటనలను, అలాగే తన వ్యక్తిగత అభిప్రాయాలను ఈ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ఆయన దర్శకత్వం వహించిన నువ్వే నువ్వే చిత్రంలోని "కంప్యూటర్స్, ఆర్ట్స్, సైన్స్" పాట ప్రారంభ కోరస్‌ను తానే పాడినట్లు వెల్లడించారు. ఈ పాట రికార్డింగ్ సమయంలో రాత్రి బాగా పొద్దుపోవడంతో, గాయకులు ఎవరూ అందుబాటులో లేరు. మరుసటి రోజు చిత్ర యూనిట్ ఊటీలో షూటింగ్‌కు బయలుదేరాల్సి ఉండటంతో సమయం తక్కువగా ఉండేది. అప్పటి పరిస్థితులలో నేరుగా రికార్డింగ్ చేసుకునే సాంకేతికత కూడా అందుబాటులో లేకపోవడం వల్ల, సంగీత దర్శకుడు కోటితో కలిసి త్రివిక్రమ్ స్వయంగా ఆ పాటలోని కొన్ని లైన్లను ఆలపించారు. "పాపంరో పాపాయిరో" వంటి నాలుగు లైన్ల లిరిక్స్ మాత్రమే తాను పాడానని, "కంప్యూటర్స్, ఆర్ట్స్, సైన్స్" పాటలోని ప్రధాన భాగాన్ని మాత్రం గాయకులే పాడారని త్రివిక్రమ్ స్పష్టం చేశారు. ఈ సంఘటన ఆయన సినీ కెరీర్‌లో ఒక ఆసక్తికరమైన జ్ఞాపకంగా నిలిచిపోయింది.నువ్వే నువ్వేలో కోరస్ పాడిన తర్వాత, త్రివిక్రమ్ గురు చిత్రంలో ఒక పూర్తి పాటను పాడి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. ఆయన తన గాన ప్రయాణాన్ని గురించి మరింత వివరించారు. నటుడు వెంకటేష్ కూడా ఇటీవల పాటలు పాడి పెద్ద హిట్ అందుకున్నారని, గతంలో ఒక ఈవెంట్లో తాను పాడతానన్నా కూడా అవకాశం ఇవ్వలేదని త్రివిక్రమ్ సరదాగా గుర్తు చేసుకున్నారు. జనవరి 12న విడుదల కానున్న ఒక చిత్రంలో మళ్లీ పాట పాడతారా అని అడగగా, దాని గురించి ఇంకా ఏమీ అనుకోలేదని, దర్శకుడు అనిల్‌ని కనుక్కుంటానని చెప్పారు.